



వెలితిక్కడ.. వెలుగక్కడ..!

"చూడు ఒకవైపే చూడు.. రెండోవైపు చూడాలనుకోకు.. అనే సినిమా డైలాగులా ఉంది బెంజి సర్కిల్ పైవంతెనపై వీధిదీపాల తీరు. రామవరప్పాడు వైపు నుంచి స్క్రూబ్రిడ్జి వైపు వీధిదీపాలు వెలుగుతుండగా... స్క్రూబ్రిడ్జి నుంచి రామవరప్పాడు వైపు వెలగకుండా చీకటిగా మారాయి. వాహనాల వెలుతురు తప్ప ఒక్క బల్బు కూడా వెలగడం లేదు.

- ఈనాడు, అమరావతి

జిల్లా విద్యాశాఖాధికారిగా పీవీజే రామారావు



మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారిగా పీవీజే రామారావు నియమితులయ్యారు. ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు డీఈవోగా పనిచేసిన తాహెరా సుల్తానాను బదిలీ చేసి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా డీఈవోగా పనిచేస్తున్న రామారావును నియమించారు.

ఈనాడు
అమరావతి
కృష్ణా
శుక్రవారం అక్టోబరు 25, 2024

మహానగరికి.. మరో మణిహారం

- అమరావతి రైల్వేలైన్‌తో ఈ ప్రాంతానికి మహర్దశ
- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లావాసులకు వరం
- విజయవాడకు వెలుపల ఎర్రుపాలెం నుంచి ఆరంభం
- గుంటూరుకు ముందు నంబూరు స్టేషన్ వరకు నిర్మాణం

"అమరావతి రైల్వేలైన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపడంతో ఇది రాజధానికి మరో మణిహారంగా మారబోతోంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు, ప్రధానంగా విజయవాడ, గుంటూరు నగరాలకు వరంగా మారబోతోంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ భారీగా తగ్గించబోతోంది. విజయవాడతో సంబంధం లేకుండా 39 కిలోమీటర్ల దూరంలో మలుపు తిరిగి.. అమరావతి మీదుగా గుంటూరు, అక్కడి నుంచి ఇతర నగరాలకు తేలికగా చేరుకునేందుకు వీలు కలుగుతుంది. ఈ లైన్‌ను ఐకానిక్‌గా మార్చి పర్యాటకులను సైతం ఆకర్షించడంపైనా.. ప్రభుత్వం దృష్టి సారించింది. 57 కిలోమీటర్ల అమరావతి రైల్వే లైన్‌లో.. కృష్ణా నదిపై నిర్మించబోయే 3.2 కి.మీ. ఐకానిక్ వంతెన పర్యాటకులను ఆకర్షించబోతోంది. ఈ రైల్వేలైన్ పర్యావరణహితంగానూ ఉండబోతోంది. ఈ నూతన లైన్‌తో వాహన కాలుష్యాన్ని సైతం పెద్దఎత్తున తగ్గించబోతున్నారు."



దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత రద్దీ స్టేషన్లలో విజయవాడ ఒకటి. నిత్యం రైల్వేస్టేషన్ మీదుగా 250 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. సాధారణ రోజుల్లోనే లక్ష మందికి పైగా ప్రయాణికులు వచ్చి వెళ్తుంటారు. సెలవులు, పండగ రోజుల్లో రెండు లక్షల మంది దాటుతుంటారు.



పర్యావరణ హితపథం

ఎర్రుపాలెం-నంబూరు మధ్యలో తొమ్మిది కొత్త స్టేషన్లు రానుండడంతో ఈ ప్రాంతాలన్నింటికీ రైలు కనెక్టివిటీ ఏర్పడుతుంది. తద్వారా వాహన కాలుష్యం విపరీతంగా తగ్గుతుంది. పరిటాల రైల్వేస్టేషన్ వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్‌ను నిర్మించనున్నారు. వీటన్నింటికి తోడు కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అసలు సంబంధమే లేకుండా ఉండేలా ఈ నూతన లైన్‌ను పర్యావరణహితంగా నిర్మించనున్నారు.

– ఈనాడు, అమరావతి

విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకల్లో జాప్యం, ప్లాట్‌ఫాంల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రత్యామ్నాయంగా విజయవాడకు చుట్టుపక్కల ఉన్న



కృష్ణాకెనాల్(తాడేపల్లి), గుణదల, రాయనపాడు స్టేషన్లను శాటిలైట్‌గా మార్చాలనే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. తాజాగా అమరావతి లైన్‌కు కూడా ఆమోదముద్ర పడడంతో.. గుంటూరు వైపు వెళ్లే రైళ్లు.. విజయవాడకు రావాల్సిన అవసరం ఉండదు.

పర్యాటకాభివృద్ధికి దోహదపడేలా నిర్మాణం

అమరావతిని దేశంలో ప్రధాన నగరాలు అన్నింటితో కలిపేందుకు ఈ నూతన లైన్ దోహదపడుతుంది. ఈ నూతన లైన్‌ను అనుకున్న లక్ష్యంలోగా పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించబోయే ఈ లైన్‌లో అనేక విశేషాలుంటాయి. ఐకానిక్ వంతెన కూడా కృష్ణా నదిపై వస్తుండడంతో పర్యాటకాభివృద్ధికి సైతం దోహదపడుతుంది.

– పి.ఈ.ఎడ్విన్, ఏడీఆర్ఎం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విజయవాడ రైల్వేడివిజన్

శుభపరిణామం.. ప్రగతికి మార్గం



అమరావతి రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడం శుభపరిణామం. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన మన రాజధానిలో నూతన రైలు మార్గం ఏర్పాటు చేయడం గొప్ప విషయం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాని మోదీని సైతం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా కలిసినప్పుడు విజ్ఞప్తి చేశారు. రాజధాని అభివృద్ధిలో ఈ రైలు మార్గం కూడా భాగం కాబోతోంది. విజయవాడ, గుంటూరు మధ్యలో మరో కీలకమైన రైల్వే మార్గంగా ఇది మారుతుంది. బందరు పోర్టుకు కూడా ఈ మార్గం అనుసంధానం అవుతుంది. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాలే కొలువు దీరడంతో మనకు ఇలాంటి గొప్ప ప్రాజెక్టులు వస్తున్నాయి. త్వరలో మచిలీపట్నం-రేపల్లె రైల్వే ప్రాజెక్టు కూడా పట్టాలెక్కబోతోంది. ఈ నూతన రైలు మార్గాల రాకతో.. రాష్ట్రంలో ప్రయాణికుల రాకపోకలతోపాటు, సరకు రవాణాకు మార్గం సుగమం అవుతుంది.

– వల్లభనేని బాలశౌరి, బందరు ఎంపీ

రాజధాని అమరావతిలో కీలకం..

– కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ ఎంపీ



విజయవాడ రైల్వే జంక్షన్‌కు రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. అమరావతి నూతన మార్గంతో విజయవాడ మీద కూడా ఒత్తిడి తగ్గబోతోంది. ఈ కొత్త మార్గంతో మన రాజధాని అమరావతికి.. దేశంలోని ప్రధాన నగరాలతో అనుసంధానం ఏర్పడనుండడం శుభపరిణామం. భవిష్యత్తులో ఈ రైల్వే లైన్ కీలకంగా మారబోతోంది. హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాలను కలిపేలా.. బుల్లెట్ రైళ్లను సైతం ఏర్పాటు చేస్తామని కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ఈ నూతన రైల్వేలైను వాటన్నింటికీ ఆరంభంగా భావిస్తున్నాం.

విజయవాడ బయట నుంచే వెళ్లేలా...

దిల్లీ ప్రధాన లైన్‌లో వచ్చే రైళ్లు విజయవాడతో సంబంధం లేకుండా నేరుగా అమరావతి మీదుగా గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడకు 39 కిలోమీటర్ల దూరంలో కొండపల్లి రిజర్వ్‌ఫారెస్ట్‌కు వెలుపలి నుంచి సరిగ్గా ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఈ లైన్‌ను అమరావతికి అనుసంధానం చేస్తారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు స్టేషన్‌కు కలుపుతారు. నంబూరు నుంచి గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడ, గుంటూరు మధ్యలో నంబూరు ఉంటుంది. ఈ నూతన లైన్ విజయవాడకు బైపాస్ లాంటిదే. భవిష్యత్తులో ఈ లైన్ అత్యంత ప్రధానమైన మార్గంగా మారబోతోంది. అమరావతి నుంచి ఎర్రుపాలెం వైపు వస్తే దిల్లీ, హైదరాబాద్, అహ్మదాబాద్, ముంబయి వెళ్లిపోవచ్చు. నంబూరు నుంచి గుంటూరు స్టేషన్, అక్కడి నుంచి తెనాలి వస్తే ప్రధాన రైల్వే లైన్‌లో కలిసిపోతుంది. అక్కడినుంచి విశాఖ, చెన్నై, బెంగళూరు, కేరళ వరకూ వెళ్లిపోవచ్చు.


అమ్మ తోడు.. అక్రమం చూడు!

"అక్కడ ఎకరం మార్కెట్ విలువ.. రూ.20 కోట్లు పైమాటే. రిజిస్ట్రేషన్ విలువ రూ.5 కోట్ల వరకు ఉంది. జాతీయ రహదారి పక్కన భూమి. విలువ బాగా పెంచారు. అలాంటివి 3.60 ఎకరాలు ప్రభుత్వ అవసరాలకు సేకరించారు. భూసేకరణ చట్టం మేరకు రెండున్నర రెట్లు పరిహారం ఇస్తారు. అంటే ఎకరానికి రూ.12.50 కోట్లు. 3.60 ఎకరాలకు రూ.55.80 కోట్లు రావాలి. ఈ సొమ్ము దుర్గగుడి అధికారులకు చేదుగా మారింది. పరిహారాన్నీ మరిచి.. భూముల రక్షణనూ విస్మరించిన ఫలితంగా ఇది వివాదంలో పడింది. దాదాపు రూ.55 కోట్ల పరిహారం గద్దలు తన్నుకెళ్లేలా రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ పరిహారం చెల్లించి ఉండవచ్చని రెవెన్యూ శాఖ అనుమానిస్తోంది. దేవదాయ శాఖ భూముల రక్షణకు జగన్ ఏలుబడిలో చర్యలు లేని వేళ కబ్జాలు పేట్రేగాయి. ప్రసిద్ధ దుర్గగుడి భూములకూ ఎసరెట్టిన దారుణమిది."

ఈనాడు, అమరావతి

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దేవస్థానానికి రాష్ట్రంలో.. ఇతర రాష్ట్రాల్లోనూ ఆస్తులు ఉన్నాయి. వాటిలో పొలాలే ఎక్కువ. భూములు.. స్థిర, చర ఆస్తుల లెక్కలు నిర్వహించి.. ఏటా ఆదాయం చూపాలి. దీనిపై ఆలయ అధికారులకు పట్టింపు లేకుంది. దుర్గగుడికి సర్వే నెంబరు 202/1లో 6.25 ఎకరాలు ఉంది. ఇది ఒక రికార్డులో 9 ఎకరాలుగా.. రెవెన్యూ రికార్డుల్లో 8.66 ఎకరాలుగా ఉంది. జలవనరుల శాఖ లెక్కల్లో 6.25 ఎకరాలుగా ఉంది. దాదాపు 9 ఎకరాలను గూడవల్లి గ్రామ రైతు కౌలుకు చేస్తున్నారు. ఏటా ఈయనకు కౌలు తిరిగి పునరుద్ధరించాలి. ఈ భూమి గూడవల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉంది. అయితే ఈ పొలాన్ని దుర్గగుడి అధికారులు సేద్యం చేయనీయకుండా కొంత ప్రాంతాన్ని మాత్రమే ఇచ్చారు.

- రూ.కోట్ల విలువైన మాన్యంపై కన్ను..
- బుడమేరు విస్తరణలో దక్కని పరిహారం
- 3.60 ఎకరాలు సేకరించినట్లు నిర్ధారణ
- అయినా పట్టించుకోని దుర్గగుడి అధికారులు



పరిహారం ఏమాయె...?

2012లో బుడమేరు విస్తరణకు ప్రతిపాదించి.. సర్వే నెంబరు 2002/1లో 3.60 ఎకరాలు సేకరిస్తున్నట్లు నోటిఫై చేశారు. ఆ మేరకు దుర్గగుడికి ఆదాయం రావాలి. కొత్త చట్టం ప్రకారం దేవదాయ భూములు ప్రజాహితానికి సేకరించినా పరిహారం ఇవ్వాల్సిందే. జాతీయ రహదారుల సంస్థ కూడా అలాగే చెల్లిస్తోంది. బుడమేరు విస్తరణలోనూ దీనికి పరిహారం అర్హత ఉంది. 2019లో అందరికీ పరిహారం ఇచ్చినా.. వీటికి ఇవ్వలేదు. దుర్గగుడి యాజమాన్య పర్యవేక్షణలో ఉన్నందున పరిహారం గుడికే రావాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ పరిహారం ఎవరు తీసుకున్నారు? ఇచ్చారా లేదా అనేది తేలనేలేదు.

ఇదండీ వీరి చిత్తశుద్ధి...

బుడమేరుకు భూసేకరణ జలవనరుల శాఖ గుడివాడ డ్రెయినేజీ విభాగం ఆధ్వర్యంలో సేకరించారు. 2019లో విజయవాడ సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో 2002/1 సర్వే నెంబరులో 3.60 ఎకరాలు సేకరించినట్లు నమోదు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అనీ.. పరిహారం ఇవ్వక్కర్లేదని తేల్చారు. వాస్తవానికి వర్గీకరణలో, నోటిఫికేషన్‌లో ఆలయ భూములనే గుర్తించారు. దీనిని కొందరు 2020లో నాటి దుర్గగుడి ఈవో, అదనపు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. అప్పుడు లేఖ రాశారు. 2020లో రాసిన లేఖ రెవెన్యూ శాఖకు 2022లో పంపారంటే.. ఎంత శ్రద్ధనో అర్థం అవుతుంది. లేఖ సంఖ్య సీ1/702/2020. దాని మీద తేదీ 02.12.2022గా ఉంది. ఆ తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుతం డ్రెయినేజీ డివిజన్ గుడివాడ ఈఈ పరిశీలించి కృష్ణా కలెక్టర్‌కు నివేదించారు. సర్వే నెంబరు 202/1లో 3.60 ఎకరాలు సేకరించి బుడమేరు విస్తరణ చేపట్టినట్లు ధ్రువీకరించారు. దేవస్థానానికి పరిహారం ఇవ్వలేదని 2023 జులైలోనే నివేదించారు.

కళ్లెదుటే.. కొల్లగొట్టే యత్నం

ప్రస్తుతం ఈ భూములు ప్రైవేటు పట్టా భూములనీ.. దుర్గగుడి సర్వే నెంబరులో 6.25 ఎకరాలే ఉన్నాయని మిగిలిన పట్టా భూమి ప్రైవేటు వ్యక్తులదని తెరమీదకు తెస్తున్నారు. రెవెన్యూ దస్త్రాల మేరకు 8.66 ఎకరాలనీ, వాటిలో 2.41 ఎకరాలు దుర్గగుడివి కాదని అంటున్నారు. రూ.కోట్ల విలువైన భూమి ప్రైవేటు వ్యక్తులకెళ్లే ప్రమాదం ఉన్నా దుర్గగుడి వారి భూమి తమదే అని ధ్రువీకరించే దస్త్రాలు ఇవ్వట్లేదు.

యంత్రాలతో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ బాలాజీ, వేదికపై ఎస్పీ గంగాధరరావు, జేసీ గీతాంజలి శర్మ

కలెక్టరేట్ (మచిలీపట్నం): జిల్లాలో ఇసుక రీచుల్లో యంత్రాలతో తవ్వకాలకు అనుమతి లేదని, మ్యాన్యువల్ పద్ధతిలోనే చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం ఎస్పీ గంగాధరరావు, జేసీ గీతాంజలిశర్మతో కలిసి ఇసుక తవ్వకాలపై రవాణాదారులతో సమావేశమయ్యారు. ఎన్జీటీ, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రీచుల్లో జేసీబీ, పొక్లెయిన్లను వాడే వీల్లేదన్నారు. ఈ విషయంలో సడలింపులు ఉండవని.. నిబంధనలు ఉల్లంఘిస్తే యంత్రాలను సీజ్ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమతిలేని నిర్మాణాలపై దృష్టి: మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడ) పరిధిలో అనుమతి లేని నిర్మాణాలు, లేఔట్లపై దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ముడ కార్యకలాపాలపై అధికారులతో సమీక్షించారు. బందరు కార్పొరేషన్, పెడన పురపాలక సంఘం, సీఆర్‌డీఏ పరిధి మినహా జిల్లాలోని అన్ని మండలాలు ముడ పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు. ల్యాండ్ కన్వర్షన్ లేకుండా లేఔట్లు వేయకూడదని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం తప్పనిసరిగా 15 శాతం మార్టిగేజ్, 10 శాతం ఓపెన్ స్పేస్ ఉండాలన్నారు. ముడ ఇన్‌ఛార్జి వీసీ, జేసీ గీతాంజలిశర్మ, మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు, డీపీవో అరుణ, ముడ ప్లానింగ్ అధికారిణి శాంతిలత తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పశుగణన ప్రక్రియ 25 నుంచి ప్రారంభం: జిల్లాలో పశుగణన ప్రక్రియను ఈనెల 25 నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ బాలాజీ స్పష్టం చేశారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 21వ అఖిల భారత పశుగణన, గోడపత్రికలు, పుస్తకాలను గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు.


ఆక్వా, పర్యాటక రంగాల అభివృద్ధికి అవకాశాలు: జిల్లాలో ప్రధానంగా ఆక్వా, పర్యాటక రంగాలతో పాటు పామాయిల్ సాగు అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ బాలాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్‌కు తెలిపారు. ప్రధాన కార్యదర్శి స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌పై గురువారం కలెక్టర్లతో నిర్వహించిన వీసీకి కలెక్టర్, ముఖ్య అధికారులు హాజరయ్యారు. జిల్లా విజన్ ప్రణాళిక గురించి వివరిస్తూ మల్లవల్లి పారిశ్రామికవాడ మరో గ్రోత్ ఇంజిన్ అయ్యే అవకాశాలున్నాయన్నారు. కీలక అంశాలతో కూడిన మండల, జిల్లా స్థాయి విజన్ డాక్యుమెంట్లు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు.

జిల్లా రెవెన్యూ అధికారిణిగా రోహిణి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ అధికారిణిగా పి.రోహిణి నియమితులయ్యారు. ప్రభుత్వం గురువారం చేపట్టిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న కె.చంద్రశేఖరరావును సాధారణ పరిపాలనా విభాగానికి రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. ఆయన స్థానంలో మహిళా, శిశు సంక్షేమ శాఖలో ఆర్‌జేడీగా విధులు నిర్వహిస్తున్న రోహిణిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

పెరిగిన కృష్ణా వరద ప్రవాహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద గురువారం వరద ప్రవాహం పెరిగింది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 27,685 క్యూసెక్కులు రాగా, సాయంత్రం 6 గంటలకు 35,702 క్యూసెక్కులకు పెరిగింది. 30 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. మిగతా 40 గేట్లు మూసి ఉన్నాయి. సముద్రంలోకి 21,750 క్యూసెక్కులు, పంట కాల్వలకు 13,952 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువ నుంచి పులిచింతల (వజినేపల్లి) ద్వారా 31,500, మునేరు (కీసర) నుంచి 5,272, పాలేరు నుంచి 357 క్యూసెక్కుల మేర వస్తోంది.




కాల్వలకు 13,952 క్యూసెక్కులు : ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు మొత్తం 13,952 క్యూసెక్కులు ఇస్తున్నారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 8,425, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,527 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 4,188, ఏలూరు కాల్వకు 1,302, కేఈబీ కాల్వకు 1,300, బందరు కాల్వకు 1,705 క్యూసెక్కులు విడుదల చేశారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఈనాడు – అమరావతి

పవిత్ర కార్తిక మాసం వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభం కాబోతోంది. ఇది నవంబరు 30న ముగుస్తుంది. ఈ మాసంలో పరమ శివుడికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. కార్తిక సోమవారం రోజు శైవక్షేత్రాలను దర్శిస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకుని పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. గత ఏడాది ఎక్కువ మంది భక్తులు పంచారామాలు, త్రిలింగ దర్శిని ప్యాకేజీలను వినియోగించుకున్నారు. ఈ ప్యాకేజీలతోపాటు వనభోజనాలు, ఆలయాల సందర్శన కోసం కూడా చాలా మంది వ్యక్తిగతంగా ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఆదాయం సమకూరింది. ఈ ఏడాది కూడా గత ఏడాది కంటే ఎక్కువ సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేస్తున్నారు.



వివిధ డిపోల నుంచి తిరగనున్న ప్రత్యేక సర్వీసులు

డిపో	బస్సులు
జగ్గయ్యపేట	34
తిరువూరు	34
విజయవాడ	150
ఇబ్రహీంపట్నం	25
విద్యాధరపురం	15
ఆటోనగర్	30
గవర్నర్‌పేట-1	22
గవర్నర్‌పేట-2	40
మొత్తం	350

ఈసారి 350 సిద్ధం...

ఎన్టీఆర్ జిల్లా నుంచి పంచారామాలు, శైవ క్షేత్రాలకు ఈ ఏడాది రికార్డు స్థాయిలో 350 ప్రత్యేక బస్సులు వేశారు. ఈసారి డిమాండ్ ఎక్కువగా ఉండొచ్చని గతం కంటే సర్వీసులను పెంచారు. పంచారామాల ప్యాకేజీ కింద ఒకేరోజు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోటలో క్షేత్రాలను దర్శించుకునే వీలుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా యాగంటి, మహానంది, శ్రీశైలం ఆలయాలకు ఒకటిన్నర రోజులో వెళ్లి వచ్చేలా త్రిలింగ దర్శిని ప్యాకేజీని సైతం తయారు చేశారు. వీటితోపాటు శ్రీశైలం, కొండవీడు, అన్నవరం, కర్ణాటకలోని దేవనహళ్లి తదితర ఆలయాలకు వేరుగా బస్సులు నడుపుతున్నారు. డిమాండ్‌ను బట్టి అరుణాచలం, సముద్ర స్నానాలకు కూడా తిప్పనున్నారు.

రికార్డు ఆదాయం

గత ఏడాది కార్తిక మాసంలో స్పెషల్ బస్సులు కిటకిటలాడాయి. జిల్లా నుంచి పలు శైవ క్షేత్రాలకు ఆర్టీసీ అధికారులు 301 బస్సులు నడిపారు. ఎన్నడూ లేనివిధంగా రూ.86.44 లక్షల రాబడి ఆర్టీసీకి వచ్చింది. 87 శాతం ఓఆర్ నమోదైంది. కిలోమీటరుకు రూ.58.72 జమ అయింది. కొవిడ్‌కు ముందు 2019లో వచ్చిన ఆదాయం కంటే ఇది ఎక్కువ. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ఇంకా ఎక్కువ రద్దీ ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆగని సమ్మె.. కదలని చెత్త

11 రోజులుగా పేరుకుపోయిన 1210 టన్నుల వ్యర్థాలు

ఇంకా విధుల్లోకి రాని క్లాప్ వ్యాన్ డ్రైవర్లు

న్యూస్‌టుడే, కానూరు, పోరంకి

క్లాప్‌వ్యాన్ డ్రైవర్లు 11 రోజులుగా చేస్తున్న సమ్మె ప్రభావం పురపాలిక పారిశుద్ధ్యంపై తీవ్రంగా పడింది. ఇంటింటికీ వచ్చి చెత్త తీసుకువెళ్లే వాహనాలు రాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తమకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

11 రోజులుగా నిరసన..

క్లాప్‌వ్యాన్ డ్రైవర్లు ఈ నెల 13 నుంచి సమ్మె మొదలు పెట్టగా గురువారానికి 11 రోజులైంది. అప్పటి నుంచి ఎక్కడా చెత్తవ్యాన్లు వెళ్లి చెత్త సేకరణ చేయట్లేదు. తమకు రావాల్సిన 3 నెలల జీతాలను చెల్లించే వరకు తాము విధులకు హాజరుకామని వ్యాన్ డ్రైవర్లు చెబుతున్నారు. పురపాలిక అధికారులు మాత్రం ఈ విషయం తమ చేతుల్లో లేదని, ప్రభుత్వం చెల్లించాలని చెబుతున్నారు. రోజుకు 110 టన్నుల చొప్పున 11 రోజులకు 1210 టన్నుల చెత్త పురపాలికలో ఉత్పత్తి అయింది. వ్యాన్ డ్రైవర్లు లేకపోవడంతో కొన్ని ముఖ్య ప్రాంతాల్లో ట్రాక్టర్లు పెట్టి చెత్త తీయిస్తున్నారు. కొత్తగా కమిషనర్ పి.భవానీ ప్రసాద్ వచ్చారు. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కరించాల్సి ఉంది.

❖ ట్రాక్టర్లతో చెత్త తరలిస్తున్నాం: భవానీప్రసాద్, కమిషనర్, తాడిగడప పురపాలిక సంఘం

వ్యాన్ డ్రైవర్ల సమ్మె కారణంగా పలు ప్రాంతాల్లో చెత్తను ట్రాక్టర్ల ద్వారా సేకరించి తరలిస్తున్నాం. ఈ సమస్యపై నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వం చేతుల్లో ఉంది. అప్పటి వరకు ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

పురపాలిక సమాచారం

పురపాలిక: తాడిగడప పురపాలక సంఘం
జనాభా: 2,00,000
క్లస్టర్లు: నాలుగు (కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు)
రోజుకు పురపాలికలో ఉత్పత్తి అయ్యే చెత్త: 110 టన్నులు.
గత 11 రోజులుగా ఉత్పత్తి అయిన చెత్త 1210 టన్నులు
క్లాప్‌వ్యాన్ డ్రైవర్లు: 42 మంది


బందరు: ఆయిల్ కోసం ఆటోల బారులు

మచిలీపట్నంలో పరిష్కారం..

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: గత వారం రోజులుగా ఆగిన చెత్త ఆటోలు మళ్లీ ఆయా ప్రాంతాలకు చెత్త సేకరణకు సిద్ధం అయ్యాయి. క్లాప్ కార్యక్రమం అమల్లో భాగంగా బాధ్యతలు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ నుంచి వేతన బకాయిలు ఉండటంతో డ్రైవర్లు విధులకు రావడం లేదు. దీంతో నగరంలో 41 ఆటోలు ఆగిపోయాయి. నగరపాలక సంస్థకు చెందిన ట్రాక్టర్లతో చెత్త సేకరించేలా అధికారులు చర్యలు చేపట్టారు. అధికారుల నుంచి సానుకూలత రావడంతో మళ్లీ విధుల్లోకి రావడానికి డ్రైవర్లు అంగీకరించారు. దీనిపై నగరపాలకసంస్థ కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ గురువారం నుంచే విధుల్లోకి వస్తామని గుత్తేదారు సంస్థ ప్రతినిధులు వచ్చి కలిశారని, అప్పటికే సమయం అయిపోవడంతో శుక్రవారం నుంచి రావాల్సిందిగా సూచించామన్నారు.


పోరంకి ఆర్టీసీ కాలనీలో రోడ్లపై పేరుకున్న చెత్త


శ్రీనివాసనగర్ కాలనీలో ఇలా..

వీటికి పరిహారం లేనట్లేనా?

ఆదుకోవాలని కోరుతున్న జామ, మామిడి, నిమ్మ తోటల రైతులు

న్యూస్‌టుడే, అవనిగడ్డ

గత నెలలో కృష్ణా నదికి భారీగా వచ్చిన వరదలకు నీట మునిగిన పలుపాయ లంకలో నష్టపోయిన జామ, పునాస మామిడి తోటలకు, వరద నీటిలో మునిగి తెగుళ్లు సోకి ఎండుతున్న నిమ్మ తోటలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో 1100 ఎకరాల్లో మామిడి, 100 ఎకరాల్లో జామ/తైవాన్ జామ, 50 ఎకరాల్లో నిమ్మ తోటలు సాగు చేస్తున్నారు. ఈ తోటలు అత్యధికంగా అవనిగడ్డ, మోపిదేవి, ఘంటసాల మండలాల్లోనే ఉన్నాయి.

❖ తైవాన్ జామ కాయలకు కవర్లు కట్టడంతో వరద నీటిలో మునగడం వల్ల కాయలు కుళ్లిపోయాయి. పిందెలు ఎండిపోయాయి. ఆకస్మికంగా భారీ వరద రావడంతో కాయలు కోసే అవకాశం కూడా లేకపోయిందని, కాయలకు రక్షణ కోసం కట్టిన కవర్లు కూడా తీయకపోవడంతో కవర్లలోనే కాయలు కుళ్లి/ఎండిపోయాయని రైతులు చెబుతున్నారు.

❖ పునాస మామిడి తోటలో తయారైన కాయలు కూడా కుళ్లిపోయి రాలిపోతున్నాయి.

❖ ఈ తోటల్లో సాగు అవసరాల కోసం నీటి మోటార్లు ఏర్పాటు చేసుకున్న రైతులు కొద్ది మంది వాటిని కూడా వరద ముంపు నుంచి బయటకు తీసుకురాలేకపోయారు. దీంతో తీవ్రంగా నష్టపోయారు.

❖ కూరగాయలు, వరి పైరు, వాణిజ్య పంటలకు పరిహారం ప్రకటించిన ప్రభుత్వం పండ్ల తోటల రైతులను విస్మరించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పండ్ల తోటల రైతులకు కూడా వరద ముంపు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

❖ నిమ్మ తోటలు నీటిలో మునిగి నాలుగు రోజులు ఉండడంతో చెట్లు ఎండిపోతున్నాయని, తెగుళ్ల బారిన పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


వరద నీటిలో మునిగి ఎండిపోయిన నిమ్మ చెట్లను తొలగిస్తున్న రైతులు


కవర్లలోనే ఎండిపోయిన జామకాయలను చూపిస్తున్న కూలీలు

క్రీడా పోటీల్లో ప్రతిభ

తాడంకి(పమిడిముక్కల)న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో జరిగిన కబడ్డీ పోటీల్లో తాడంకి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు వైఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. వారిలో జూనియర్ బాలికల విభాగంలో పిండిట్ల పల్లవి, బోయి వెంకటలక్ష్మి, సీనియర్ బాలుర విభాగంలో బొల్లెద్దు అభినయతేజ ఉన్నారని, వారు త్వరలో అన్నమయ్య జిల్లా రాయచోటి, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు పి.రవీంద్రబాబు, రాజు తెలిపారు.

పామర్రు, న్యూస్‌టుడే: జగ్గయ్యపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపికలో పామర్రు జెడ్పీ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయిని ఇందిరారాణి గురువారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఎమ్డీ నూర్జహాన్, ఆదిశేషు, రవి ప్రతిభ చాటి త్వరలో గుంటూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పీడీ రవికిషోర్, మురళీలను అభినందించారు.


ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయునితో ఎంపికైన విద్యార్థులు


విజేతలతో ప్రధానోపాధ్యాయిని ఇందిరా రాణి తదితరులు

ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు మండలికి ఆహ్వానం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఖత్తర్‌లో నవంబరు 22, 23 తేదీల్లో జరగనున్న 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు ఆహ్వానం అందింది. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షుడు వంగూరి చిట్టెన్ రాజు ఆహ్వానం పంపించారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళావేదిక, దోహ, ఖత్తర్ సంయుక్తాధ్వర్యంలో ఖత్తర్ రాజధాని దోహ మహానగరంలోని డీపీఎస్ మోనార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు నిర్వహించనున్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు భాష, సాహిత్యం ఆవశ్యకతపై సందేశం ఇవ్వాలని బుద్ధప్రసాద్‌ను కోరారు.


ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు

ఆంధ్రా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు

ఈనాడు, విశాఖపట్నం: యూకేకు చెందిన హీలింగ్ లిటిల్ హార్ట్స్, మహేష్ బాబు ఫౌండేషన్ సౌజన్యంతో 32వ ఉచిత పిల్లల గుండె శస్త్రచికిత్సల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు పేర్కొన్నారు. కేజీహెచ్ సమీపంలోని ఆంధ్రా ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘ఈ నెల 21 నుంచి 26 వరకు 15 సంక్లిష్ట గుండె శస్త్రచికిత్సలు ఉచితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 9 మంది చిన్నారులకు శస్త్రచికిత్స పూర్తయ్యింది. విశాఖలో రెండోసారి ఈ శిబిరం నిర్వహిస్తున్నాం. తొమ్మిదేళ్లలో విజయవాడ, విశాఖలోని ఆంధ్ర హాస్పిటల్స్‌లో 4000 గుండె శస్త్రచికిత్సలు జరిగాయి. వాటిలో అధిక శాతం ఎన్టీఆర్ వైద్యసేవ, మహేష్ బాబు ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో ఉచితంగా చేసినవే. ఆంధ్ర హాస్పిటల్స్ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో పీడియాట్రిక్ కార్డియాలజీ, నవజాత శిశువులు, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ బృందాలు కలసికట్టుగా పనిచేయడంతో ఇది సాధ్యపడింది. రాబోయే రోజుల్లో ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి ఈ శిబిరం నిర్వహిస్తాం’ అని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర హాస్పిటల్స్ వైద్య నిపుణులు రేవంత్, విక్రమ్, రవీంద్ర దేవ్, సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, పద్మావతి తదితరులు మాట్లాడారు. యూకేకు చెందిన వైద్య నిపుణులు సిమోన్, స్నిగ్ధ పద్మాళ్వార్, శరన్ దురైరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు, పాల్గొన్న వైద్య నిపుణులు

సినీ సాహిత్యానికి కావ్య గౌరవం తెచ్చిన కవి గోపి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉన్నత విలువలతో గీతాలు రాసి సినీ పాటకు కావ్య గౌరవం కల్పించిన మహాకవి మైలవరపు గోపి అని ఏపీ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కొనియాడారు. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో వంశీ ఇంటర్నేషనల్, ప్రముఖ గాయని శారద అకునూరి (అమెరికా) సంయుక్తంగా నాటి గీత రచయిత గోపికి స్వర నీరాజనం ‘మనసా కవ్వించకే ’శీర్షికన సమర్పించారు. శారదతో పాటు గాయకులు రమణ, రాము వేణు శ్రీరంగం రామారావు పలు పాటలు ఆలపించారు. అనంతరం జరిగిన సభలో శారదను బుద్ధ ప్రసాద్ సత్కరించి మాట్లాడారు. దివిసీమ అనగానే ఠక్కున గుర్తుకొచ్చేది వేటూరి అని, అదే ప్రాంతంలో మరో కవి గోపి ఉండటం ఎంతో గౌరవంగా ఉందన్నారు. ఒకప్పుడు తెలుగు పాటకు జాతీయ అవార్డు వస్తేనే గొప్పగా చెప్పుకునే వాళ్లమని, తెలుగు సినీ పాటకు అంతర్జాతీయ స్థాయి గౌరవం సైతం చంద్రబోస్ వల్ల దక్కిందని గుర్తు చేశారు. గోపి పాటల కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏర్పాటు చేస్తామన్నారు. నిర్వాహకులు వంశీ రామరాజు స్వాగతం పలికారు. సభలో నృత్య దర్శకురాలు సుచిత్ర చంద్ర బోస్, దర్శకులు రేలంగి నరసింహారావు, వెంకన్న మైలవరపు గోపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ఆకునూరి శారదను సత్కరిస్తున్న బుద్ధప్రసాద్, రేలంగి నరసింహారావు, వంశీ రామరాజు, సుచిత్ర, వెంకట్ తదితరులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 131, 140, 151 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

27 నుంచి ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపికలు ఈ నెల 27 నుంచి వేర్వేరు ప్రాంతాల్లో పలు క్రీడాంశాల్లో నిర్వహిస్తామని సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. ఉదయం 9 గంటలకు బ్లూమింగ్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అండర్-19 బాలబాలికల స్విమ్మింగ్, వచ్చే నెల ఒకటో తేదీన ఉదయం 9 గంటలకు మారిస్ స్టెల్లా కళాశాలలో బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో ఖోఖో, వాలీబాల్ జట్ల ఎంపికలు, వచ్చే నెల 2వ తేదీన ఉదయం 9 గంటలకు మారిస్ స్టెల్లా కళాశాలలో నెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు సంబంధిత పత్రాలతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 94401 12455 నంబరుపై సంప్రదించాలన్నారు.

వరుడు మైనర్.. వధువు మేజర్

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం నందిగామకు చెందిన ఇరువురు ప్రేమికులు పెళ్లి చేసుకుని గురువారం పెడన పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఇద్దరిలో వరుడు మైనర్ (పెళ్లికి) కాగా వధువు మేజర్ కావడం గమనార్హం. వధువుకు 18 ఏళ్లు నిండగా వరుడికి 19 సంవత్సరాల వయస్సు. అమ్మాయి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండగా, అబ్బాయి ఇంటర్ వరకు చదివి ఆపేశాడు. దీంతో పోలీసులు ఇరువైపులా పెద్దల్ని పిలిపించి చర్చించారు. పెళ్లి విషయంలో 21 సంవత్సరాలు దాటే వరకు యువకుల్ని మైనర్‌గా పరిగణించాలని చట్టం స్పష్టం చేస్తోందని ఎస్సై జి.సత్యనారాయణ పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేయాలా లేదా, కౌన్సెలింగ్ ఇచ్చి పంపించాలా అన్న దానిపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు.

వర్సిటీలో సౌకర్యాలపై న్యాక్ బృందం ఆరా

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జాతీయ అసెస్‌మెంట్, అక్రిడేషన్ కమిటీ (న్యాక్) సభ్యులు కృష్ణావిద్యాలయంలో నిర్వహిస్తున్న పరిశీలన కొనసాగుతోంది. కమిటీ ఛైర్మన్ ఎన్‌కే లోక్‌నాథ్‌తో పాటు సభ్యులు రిచామదన్, సంజీవ్‌కుమార్‌శర్మ, ప్రదీప్‌డియోట, ప్రకాష్‌చంద్రప్రదాన్, సుప్రీతమ్‌రాయ్, హేమంత్‌దేశ్‌ముఖ్‌లు బృందాలుగా ఏర్పడి గురువారం వివిధ విభాగాలను పరిశీలించారు. పరీక్షల విభాగం, అకడమిక్‌సెల్, గ్రంథాలయం, కంప్యూటర్స్ అండ్ సైన్స్ విభాగాలను సందర్శించి ఆయా విభాగాల ఉద్యోగులతో మాట్లాడి వివరాలు సేకరించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల్లో విద్యార్థులతో మాట్లాడి నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రతిభచాటుకున్న విద్యార్థులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఆయా విభాగాల ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన తిలకించారు.


ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రతినిధులు

బంగారు, వెండి ఆభరణాల చోరీ

మేడూరు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టి బంగారం, వెండి ఆభరణాలు, నగదు చోరీ చేసిన సంఘటన బుధవారం రాత్రి మేడూరులో చోటుచేసుకుంది. మాజీ సర్పంచి యలమంచి సాయికృష్ణ కుటుంబంతో గ్రామాంతరం వెళ్లారు. గురువారం ఉదయం పనివారు వచ్చి ఇంటితాళం పగలగొట్టి ఉండడం గమనించి పొరుగువారికి సమాచారం ఇచ్చారు. అనంతరం ఊరి నుంచి వచ్చిన సాయికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలు ప్రధాన ద్వారం, పడక గది, లాకర్ తాళాలు పగలగొట్టి లాకర్, బీరువాల్లోని 10 నవర్సుల బంగారం, 10 కిలోల వెండి వస్తువులు, రూ. 80 వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు సాయికృష్ణ తెలిపారు. దొంగలు చేతికి తొడుగులు వినియోగించడం వల్ల ఆనవాళ్లు దొరకలేదని వేలి ముద్రల బృందం అనుమానిస్తోంది. పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్ఐ బి.శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

రావి వెంకటేశ్వరరావుపై కేసు కొట్టివేత

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపై ఎస్సీ, ఎస్టీ, అత్యాచారాల నిరోధక చట్టం కింద పెట్టిన కేసు కొట్టి వేస్తూ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయమూర్తి ఎస్.చినబాబు గురువారం తీర్పు చెప్పారు. 2020 నవంబరు 7న ‘మా ఇల్లు.. మా స్వాధీనం’ కార్యక్రమాన్ని నిర్వహించి గుడివాడ నియోజకవర్గ పరిధిలోని మల్లాయిపాలెంలో టిడ్కో ఇళ్ల వద్ద పనిచేస్తున్న ఉద్యోగులను అడ్డగించారని, కులం పేరుతో దూషించారన్న ఫిర్యాదుపై గుడివాడ తాలూకా పోలీసులు వెంకటేశ్వరరావుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సాక్షులు ప్రాసిక్యూషన్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడంతో నిందితులను నిర్దోషులుగా విడుదల చేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని రావి వెంకటేశ్వరరావు తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది లంకె వెంకటేశ్వరరావు తెలిపారు.

మచిలీపట్నం

●మచిలీపట్నం ●పెడన

రైల్వేస్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గురువారం చిలకలపూడి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే రైళ్లు, ప్రయాణికుల సంఖ్య, టికెట్ కౌంటర్ తదితరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం కృష్ణమూర్తి, శిక్షకుడు వీఎన్‌కే తేజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమాలు

రేవతి: వేట్టయన్
మినిరేవతి: లగ్గం
సిరివెంకట్: దేవర
సిరికృష్ణ: వెనమ్
రామరాజు: పొట్టేల్
–మచిలీపట్నం, కార్పొరేషన్

పరికరాల సరఫరాకు టెండరు గడువు 29

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: కృష్ణా జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పరికరాలు సరఫరా చేసేందుకు టెండర్లు వేసే తేదీని ఈ నెల 29వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండరులో పాల్గొనదలచిన వారు టెండరుతో పాటు ధరావతు సొమ్ము రూ.25వేలు డీడీ రూపంలో డిస్ట్రిక్ట్ అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్, కృష్ణా, మచిలీపట్నం పేరు మీద 29వ తేదీ సాయంత్రం 4గంటల లోపు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి కార్యాలయం, మచిలీపట్నంలోని అగ్రికల్చరల్ మార్కెట్ యార్డ్ వారిని కార్యాలయ పనిదినాల్లో ఫోన్. నంబరు 97032 03337లో సంప్రదించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687



స్పందనకు వందనం

★ నగరంలోని దేశాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల సమీపంలోని రహదారి మధ్యలో ఉన్న కల్వర్టు పగిలిపోయి ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యపై ఈనాడులో కథనం ప్రచురించడంతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఇటీవల గుంత వద్ద కల్వర్టు దిమ్మెలు ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



★ గూడూరు మండలం మల్లవోలు పంచాయతీ పరిధిలోని ముదిరాజుపాలెంలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రిపూట రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీనిని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురావడంతో ఈనాడులో వార్త ప్రచురించి సమస్యను పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంకు వివరించగా వెంటనే స్పందించి దీపాలు ఏర్పాటు చేయించారు. సమస్య పరిష్కారం కావడంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట),గూడూరు

? పెడన రోడ్లపై ఆవుల సమస్య తీవ్రంగా ఉంది. మూగజీవాల కారణంగా ట్రాఫిక్ స్తంభిస్తోంది.
✔ ఆవుల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. స్పందించకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.
-సృజనకుమారి, టీపీవో

? పెడనలోని హోటళ్లపై పర్యవేక్షణ లోపించి కల్తీ జరుగుతోంది. ఫలితంగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. -వెంకటేష్
✔ కల్తీ నిరోధక శాఖ అధికారులకు సమాచారం ఇస్తాం
.-గోపాలరావు, మున్సిపల్ కమిషనర్

గర్భిణుల ప్రసవ వేదన

ఆస్పత్రుల్లో అందుబాటులో వైద్యుల్లేక అవస్థలు

న్యూస్‌టుడే, పెడన

పెడన నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణుల ప్రసవాలకు వైద్యులు అందుబాటులో లేక అవస్థలు తప్పడం లేదు. నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇరువురు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులను అందుబాటులోకి తెచ్చినా ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగడం లేదు. నియోజకవర్గ కేంద్రంతో పాటు నాలుగు మండలాల్లో ఈ పరిస్థితి ఉంది.



పెడనలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇదీ సమస్య..

గర్భిణులు ప్రసవాల కోసం మచిలీపట్నం, గుడివాడ, భీమవరానికి వెళ్లక తప్పడం లేదు. ప్రతి పీహెచ్‌సీలో ఒక మహిళా వైద్యురాల్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. వైద్యురాలి పర్యవేక్షణలో ముగ్గురు స్టాఫ్‌నర్సులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కానీ కొన్ని పీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సులు ఉన్నా వైద్యులు అర్జంట్ కాల్‌కు అందుబాటులో ఉండడం లేదు. పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పీహెచ్‌సీల్లో ఈ పరిస్థితి నెలకొంది.

స్థానికంగా ఉండకపోవడమే..


★ వైద్యులు స్థానికంగా నివాసం ఉండకపోవడమే ప్రసవాలు జరగకపోవడానికి ప్రధాన కారణంగా విమర్శలు వస్తున్నాయి. ఉదాహరణకు పెడన పీహెచ్‌సీ వైద్యురాలు ఉయ్యూరు నుంచి విధులకు వసున్నారు. ఫలితంగా రాత్రి సమయంలో గర్భిణులు ప్రసవాలకు వస్తుంటే స్టాఫ్ నర్సులు మచిలీపట్నం జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు.

★ నియోజకవర్గానికి చిట్టచివరన ఉండే బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో మూడు పీహెచ్‌సీలు ఉన్నా ఒక్క పీహెచ్‌సీలో కూడా రాత్రి సమయాల్లో ప్రసవాలు జరగడం లేదు. పీహెచ్‌సీలు సాయంత్రం 4గంటలకు మూసేస్తారు. ఆలోపు కేసులు వస్తేనే కాన్పులు చేస్తున్నారు. ఆ తర్వాత జనరల్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ★ వైదులు స్థానికంగా నివాసం ఉండేలా కలెక్టర్ చర్యలు తీసుకొని పీహెచ్‌సీల్లో ప్రసవాలను పెంచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంతర్జాలంలో పనిచేయని ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ ఇటీవల ప్రారంభం కాగా ఆన్‌లైన్ విధానం (మీ సేవా, ఇంటర్‌నెట్ సెంటర్, సీఎస్‌సీ) ద్వారా నమోదు చేసుకోవడానికి గురువారం సర్వర్ పని చేయలేదు. దీంతో ఎంఎల్‌సీ ఓటుగా నమోదు చేసుకోవడానికి పట్టభద్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా సర్వర్ పని చేయలేదు. నమోదుకు నవంబరు 6 చివరి తేదీ కాగా 12 రోజుల ముందుగానే సర్వర్ పనిచేయకపోవడంతో పట్టభద్రులు నిరుత్సాహానికి గురయ్యారు. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సర్వర్ పనిచేసే విధంగా సంబంధితశాఖ అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా మురాళ



బంటుమిల్లి, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ కృష్ణా జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా బంటుమిల్లి మండలం పెదతుమ్మిడికి చెందిన మురాళ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.


బందరు రోడ్డుపై లారీల తొలగింపు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ - మచిలీపట్నం రహదారిపై లారీలు నిలిపివేస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని 'ఈనాడు'లో గురువారం 'మా ఇష్టం.. ఇక్కడే నిలుపుతాం' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఎస్పీ గంగాధరరావు స్పందించారు. తక్షణం ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్, ఏఎస్ఐలు భాగ్యవతి, శంకర్, సిబ్బంది కలిసి లారీలను తొలగింపజేశారు. పార్కింగ్ స్థలంలోనే లారీలు నిలపాలన సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జరిమానా విధిస్తామన్నారు.


స్పందనకు వందనం
లారీలు తొలగింపజేస్తున్న ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్


వరద బాధితులకు జ్యుయలరీ పార్కు సంఘం సాయం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: వరద బాధితులకు తమవంతు సాయంగా రూ.5లక్షల మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించి జ్యుయలరీ పార్కు సంఘం ప్రతినిధులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ మొత్తాన్ని సంఘం ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిసి అందజేశారు. సంఘం గౌరవాధ్యక్షులు చలమలశెట్టి నరసింహారావు, అధ్యక్షులు పెద్దేటి వెంకటసుబ్బారావు, ఎండీ చలమలశెట్టి దుర్గావరప్రసాదరావు, డైరెక్టర్ దవళేశ్వరపు ఉమామహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.


చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

గొడపాలెంలో భాజపాలో చేరికలు

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం అచ్చయ్యవారిపాలెం పంచాయతీ గొడపాలెంలో పలువురు గ్రామస్థులు భాజపాలో చేరారు. ఆ పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జోనల్ ఇన్‌ఛార్జి వీర్లకృష్ణ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. ఆ పార్టీ నాయకులు జోగి రవీంద్ర, మల్లేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కుక్కల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


భాజపాలో చేరిన గ్రామస్థులతో నాయకులు

విద్యార్థుల సృజన.. సామాజిక అవగాహన

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుకోవడంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని నగరంలోని దేశాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు..విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎం.సమియా (10వ తరగతి), ఎండీ సమా ఫాతిమా(9వ తరగతి), సీహెచ్ ప్రిస్కిల్లా(10వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు ఎండీ మజహరుల్లా, ఎ.సరోజ తదితరులు కలిసి బహుమతులు అందజేశారు.



విజేతలతో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు సరోజ


వ్యాసం రాస్తున్న విద్యార్థినులు

పరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీ

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ, స్పెషల్ బీఈడీ కోర్సు నాలుగో సెమిస్టర్ కేంద్రాలను గురువారం పరీక్షల నియంత్రణాధికారి పి.వీరబ్రహ్మాచారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ కేంద్రాలను సందర్శించిన ఆయన పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. దాదాపు 95 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

ఇంటికి దీపం.. ఇంతి సంబరం

మహిళలకు ప్రభుత్వం దీపావళి కానుక
ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లపై హర్షం

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్



ప్రభుత్వం మహిళలకు దీపావళి కానుక అందించేందుకు సిద్ధమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. దీనిలో భాగంగానే ప్రభుత్వం దీనికి సంబంధించిన విధి విధానాలపై మంత్రి మండలిలో తీర్మానించిన విషయం తెలిసిందే. ఈ పథకం అమలు చేయనున్న నేపథ్యంలో మహిళల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం చంద్రబాబు ప్రకటించిన దగ్గర నుంచి బందరు, పెడన నియోజకవర్గాల్లోని సంబంధిత అధికారులు దీనిపై కసరత్తు ప్రారంభించారు. ఎక్కడెక్కడ ఎంత మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ఏయే కంపెనీల ఏజెన్సీల నుంచి సరఫరా అవుతున్నాయి తదితర అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు సిలిండర్లు ఉచితంగా అందించడంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు దీపం పథకం అమలుపై ఇలా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

చాలా సంతోషం: ఎస్.గోవర్ధనమ్మ, ఈడేపల్లి, మచిలీపట్నం



ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మాలాంటి పేద కుటుంబాలకు ఇది ఎంతో ఆసరాగా ఉంటుంది. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

ఎదురుచూస్తున్నాం: పడవల హేమసుందరి, మల్లవోలు, గూడూరు



ఉచిత సిలిండర్లు ఎప్పుడిస్తారా అని ఎదురుచూస్తున్నాం. ఎట్టకేలకు ముఖ్యమంత్రి దీపావళి కానుకగా గ్యాస్ సిలిండర్లు అందిస్తామని ప్రకటించడంతో మా ఆనందానికి అవధులు లేవు. పేద కుటుంబాల్లో గ్యాస్ కూడా భారమే అయినా ప్రస్తుతం అది అత్యవసరంగా మారింది. మూడు సిలిండర్లకు వెచ్చించే మొత్తాన్ని ఇతర అవసరాలకు వినియోగించుకునే అవకాశం కలిగింది.

ఆసరాగా ఉంటుంది: రాజులపాటి రాజ్యలక్ష్మి, సుల్తానగరం, బందరు



గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు నిర్ణయించడం సంతోషంగా ఉంది. సూపర్-6 పథకాలు ప్రవేశపెట్టినప్పుడు పలువురు హేళన చేశారు. కనెక్షన్ ఉన్నా సిలిండర్ కొనడానికి ఇబ్బందిగా ఉంటూ కట్టె పొయ్యిలతో వంట చేసుకునే మాలాంటి పేదలకు ఆసరాగా ఉంటుంది.

సమస్యలు పరిష్కరించేలా: బొల్లా సౌజన్య, పెదతుమ్మిడి, బంటుమిల్లి



దీపం పథకంలో భాగంగా ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేలా సచివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సంతోషంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ఏజెన్సీల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అలాంటివి లేకుండా అందుబాటులోనే ఏర్పాట్లు చేయడం వల్ల ఎంతో మందికి ఉపయుక్తంగా ఉంటుంది.

కూలిపోతున్నా పట్టించుకోరా!

పెడన, న్యూస్‌టుడే: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని మున్సిపల్ మహిళా వాణిజ్య సముదాయం దుస్థితికి చేరింది. ఈ సముదాయాన్ని రెండు దశాబ్దాల కిందట అప్పటి తెదేపా కౌన్సిల్ నిర్మించగా ఆ తర్వాత నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో సముదాయం లోని షాపులు శిథిల స్థితికి చేరుకున్నాయి. ఫలితంగా మొత్తం 9 షాపులకు రెండింటిని మాత్రమే లీజుకు తీసుకోగా మిగిలిన ఏడు గత కొంతకాలంగా ఖాళీగా ఉంటున్నాయి. షాపులకు మరమ్మతులు చేయించాలని లీజుదారులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడంతో షాపులు ఖాళీ చేసేశారు. ఫలితంగా పురపాలక సంఘం నెలకు దాదాపు రూ.50 వేల వరకు ఆదాయాన్ని కోల్పోతోంది. దీనిపై ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి స్పందిస్తూ.. మహిళా వాణిజ్య సముదాయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తామని, త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు.


రైల్వేస్టేషన్ రోడ్డులో పాక్షికంగా కూలిన మహిళా వాణిజ్య సముదాయం

పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేయించుకోండి

సీతనపల్లి (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: మండలంలోని పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేయించుకోవాలని మండల తెదేపా అధ్యక్షుడు ఒడుగు తులసీరావు తెలిపారు. గురువారం మండలంలోని సీతనపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ తెదేపా అధ్యక్షుడు కూనసాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టభద్రులకు ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు మాటూరి బసవేశ్వరరావు, జిల్లా రైతు నాయకుడు చేకూరి వెంకట్రావు, మండల నాయకులు యాదంరెడ్డి కొండ తదితరులు పాల్గొన్నారు.


సీతనపల్లిలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమంలో తెదేపా నాయకులు

ఇసుక ట్రాక్టర్ల హల్‌చల్

పెడన, న్యూస్‌టుడే: పెడన పట్టణంలో ఇసుక ట్రాక్టర్లు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని తప్పించుకుని అక్రమ మార్గంలో పలువురు వ్యాపారులు ఇసుకను భారీగా నిర్మాణ రంగానికి తరలిస్తున్నారు. పెడన సరిహద్దున ఉన్న కట్లపల్లి, కాకర్లమూడి, బుద్దాలపాలెం, మడక తదితర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా పెడన, మచిలీపట్నం ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో అందుబాటులో ఉన్న ఇసుకను నిర్మాణ రంగంలో భవంతుల కోసం వినియోగిస్తారు. ట్రాక్టర్ ఇసుక గతంలో రూ. 1500 వరకు ఉండగా ప్రస్తుతం రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ తరహా వ్యాపారం లాభసాటిగా ఉండడంతో డిమాండ్ పెరిగి రీచ్‌ల కోసం పోటీ పడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాను స్థానికంగా రెవెన్యూ అధికారులు నియంత్రించాలి. కానీ అధికారులు ప్రేక్షకపాత్ర పోషించడంతో పగలు, రాత్రి బహిరంగంగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ స్పందిస్తూ.. ఇసుక అక్రమ రవాణా నియంత్రిస్తామని, స్థానికంగా పర్యవేక్షించాలని వీఆర్వోలను ఆదేశిస్తామన్నారు.


పెడన రోడ్డుపై ఇసుకతో రయ్‌రయ్

నాలుగు కిలోమీటర్లు.. నరకయాతన



గూడూరు, న్యూస్‌టుడే

మండల పరిధిలోని తరకటూరు నుంచి మద్దిపట్ల వెళ్లే రహదారిలో ప్రయాణం అంటేనే ప్రయాణికులు హడలి పోతున్నారు. నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న ఈ మార్గంలో గోతులు ఏర్పడ్డాయి. తరకటూరు, మద్దిపట్ల, కంచాకోడూరు, మొవ్వ మండలంలోని పద్దారాయుడుతోట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తారు. వైకాపా ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డు నిర్మించాలని అనేకసార్లు ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. వర్షం వస్తే గుంతలు కూడా కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రస్తుత కూటమి హయాంలో రోడ్డు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


తరకటూరు వద్ద రహదారిపై అడుగడుగునా గుంతలే..


మద్దిపట్ల సమీపంలో ప్రమాదకరంగా మలుపు


రహదారి పొడవునా ఇదే తీరు

దాళ్వా వరి సాగుకు నీరు అందించండి

బంటుమిల్లి, న్యూస్‌టుడే: దాళ్వాలో వరి సాగు చేయడానికి అనుమతులు ఇవ్వడంతో పాటు సాగు నీరు అందించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం డీటీ కాగిత పూర్ణచంద్రరావుకు గురువారం నాయకులు, రైతులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతమైన బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో రెండో పంటగా వరి సాగుతో రైతుకు ఎంతో మేలని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దాళ్వాకు సాగు నీరు అందించాలన్నారు. 2020 ఏప్రిల్‌లో అతివృష్టి కారణంగా జరిగిన నష్టానికి సంబంధించి ప్రకటించిన రూ.3.36కోట్ల పరిహారం ఇప్పించాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, లంకదాసుల అజయ్‌ఘోష్, మాజేటి శివశ్రీనివాసరావు, లవయ్య పాల్గొన్నారు.


బంటుమిల్లిలో డీటీ పూర్ణచంద్రరావుకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘ నాయకులు

పబ్లిక్ ప్రకటన

నా క్లయింటు కృష్ణాజిల్లా, మచిలీపట్నం టౌన్, ఇనుగుదురుపేట, డోరు నెం: 29/438-2ఎ కాపురస్తులు సబ్బినేని సాంబశివరావు గారి కుమారుడు సబ్బినేని రవికిషోర్ గారు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని బందరు మండలం, యస్.యన్.గొల్లపాలెం గ్రామ కాపురస్తులు సూదగాని లేటు పాండురంగారావు గారి కుమారుడు నాగరాజు గారి వద్ద కొనుగోలు చేయుటకు నిశ్చయించుకొనియున్నారు. కావున యీ దిగువ షెడ్యూలు ఆస్తికి ఇతర హక్కుదారులు గానీ, క్లయిములు, తాకట్టులు గానీ, దావాలు గానీ ఉన్నయెడల తమయొక్క అభ్యంతరములు దిగువ అడ్రసుకు 20 రోజులలోగా వ్రాతపూర్వకముగా తెలియజేయవలసినది. లేని యెడల సదరాస్తి నిష్పేచి ఆస్తిగా పరిగణించబడును.
షెడ్యూలు ఆస్తి: కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, మచిలీపట్నం మండలం, యస్.యన్. గొల్లపాలెం గ్రామం, పాత ఆర్.యస్.నెం. 291, 293, 294ర్లుకు ప్రస్తుత ఆర్.యస్.నెం. 113-1-ఎ1లో య.1-50ట్లులో య.1-00ట్లు **హద్దులు: తూర్పు:** మురుగుకాలువ, **పడమర:** బేతపూడి సుందరంగారి భూమి, **దక్షిణం:** సూదగాని నాగరాజు గారి భూమి, **ఉత్తరం:** సర్కారువారి భూమి
కోట మెహర్‌ప్రసాద్, అడ్వకేట్
డోరు నెం: 17-305ఎ,
ఈడేపల్లి, మచిలీపట్నం. ఫోన్ నెం: 94407 72309
తేది: 24-10-2024, మచిలీపట్నం.

పబ్లిక్ ప్రకటన

నా క్లయింటు శ్రీ చక్కా మహేశ్వర వర్మ, తండ్రి సత్యనారాయణ గారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా..
నా క్లయింటు తండ్రిగారైన చక్కా సత్యనారాయణ గారికి యీ దిగువ ఉదహరించిన ఆస్తి కలదు. సదరాస్తికి ఆయన ఎటువంటి వీలునామా వ్రాయకుండా మరణించియున్నారు. తదుపరి నా క్లయింటు మరియు వారి సోదర సోదరీలు సత్యనారాయణ గారి ఆస్తిని జాయింటుగా అనుభవించుచున్నారు. నా క్లయింటు సోదరుడు చక్కా రాజేంద్రవరప్రసాద్‌కు సంబంధించిన దిగువ 2వ మరియు 1వ షెడ్యూలు ఆస్తిని గురించి మచిలీపట్నం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో ఓ.యస్.నెం.388/2019 దాఖలు చేయగా నా క్లయింటు తరుపున సాక్ష్యములపై విచారణ జరుగుచున్నది. ఇట్లుండగా నా క్లయింటు సోదరుడైన చక్కా రవిశంకర్ ఆయన కుమారుడు అఖిల్ కలసి దిగువ 1వ షెడ్యూలు ఆస్తి వారికి చెందినదే అని అబద్ధపు విషయాలతో మభ్యపెడుతూ అమ్మజూపుటకు ప్రయత్నించుచున్నారని తెలియవచ్చినది.
కావున దిగువ 1వ షెడ్యూలు ఆస్తిపై ఎలాంటి లావాదేవీలు జరిపిననూ నా క్లయింటును మరియు యితర భాగస్తులను బైండు చేయజాలవు అని తెలియజేయడమైనది.
1వ అయిటం : కృష్ణా జిల్లా, మచిలీపట్నం టౌన్, డోరు నెం. 30/194రు నకు చెందిన 400 చ॥గ॥ల స్థిరాస్తి నివేశన స్థలము అందు గల మద్రాస్ టెర్రస్ డాబా యింటికి **హద్దులు : తూర్పు :** చక్కా వెంకట నరశింహారావు గారి యిల్లు స్థలం; **దక్షిణం :** బృందావనం కేశవకృష్ణ గారి యిల్లు స్థలం; **పడమర :** సందు దారి; **ఉత్తరం :** మున్సిపల్ రోడ్డు.
2వ అయిటం : కృష్ణా జిల్లా, మచిలీపట్నం మండలం, పోతేపల్లి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, పోతేపల్లి గ్రామం, ఆటోనగర్‌లో వున్నటువంటి 387.57 చ॥గ॥ స్థిరాస్తి నివేశన స్థలము అందుగల షెడ్డునకు **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 233; **దక్షిణం:** ప్లాట్ నెం.237; **పడమర :** ప్లాట్ నెం. 235; **ఉత్తరం :** రోడ్డు.
కోట మెహర్‌ప్రసాద్, అడ్వకేట్
డోరు నెం. 17-305ఎ, ఈడేపల్లి, మచిలీపట్నం.
ఫోన్ నెం. 94407 72309.
మచిలీపట్నం, తేది: 24-10-2024.

నేడు డయల్ యువర్ డీఎం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ ఉయ్యూరు డిపో మేనేజరు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ తెలిపారు. సమస్యలు తెలియజేయాల్సిన వారు ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఫోను నంబరు 9959224796కు ఫోను చేసి తెలియజేయాలని కోరారు.

గ్రామ సభ నేడు

హనుమాన్ జంక్షన్: భూ రీసర్వే పూర్తైన గ్రామాల్లో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించేందుకు కురిపిరాలలో శుక్రవారం గ్రామ సభ నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వి.నాగభూషణం గురువారం తెలిపారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెనమలూరు


• పెనమలూరు • గన్నవరం

పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం

కానూరు, న్యూస్‌టుడే: కానూరు పరిధిలోని మణికంఠనగర్, సుజుకీ షోరూమ్, ఫరూఖ్‌నగర్, అశోక్‌నగర్, బందరు రోడ్డులోని కొన్ని ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని విద్యుత్తు శాఖ ఈఈ పి.హరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

పెనమలూరు, న్యూస్‌టుడే: పెదపులిపాక, తాడిగడపల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తుశాఖ అధికారులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రతిభా పోటీలు.. భవితకు మెట్లు



వ్యాసం రాస్తున్న విద్యార్థులు



విజేతలతో ప్రిన్సిపల్ కొడాలి లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు

పోరంకి, న్యూస్‌టుడే: పోరంకి విజ్ఞాన్ భారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎం.గ్రాసి (10), ఎం.లోహిత (9), కె.నిఖిత (8) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ కొడాలి లక్ష్మీదేవి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి.శైలజ, ఎస్.కె మస్తాన్‌బీ, వి.రాము పాల్గొన్నారు.

యార్లగడ్డకు ఘన స్వాగతం



ఎమ్మెల్యే వెంకట్రావుకు స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం నియోజకవర్గంలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుపై అమెరికాలోని పెట్టుబడిదారులను ఆహ్వానించేందుకు డల్లాస్ వెళ్లిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు స్థానిక ప్రవాసాంధ్రులు ఘన స్వాగతం పలికారు. 17 నెలల సుదీర్ఘ విరామం అనంతరం యార్లగడ్డ అమెరికాలోని తన వ్యాపార కార్యకలాపాలను చూసుకోవడంతో పాటు మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ఐటీ ప్రముఖులతో సమావేశమయ్యేందుకు విదేశీ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మీదుగా డల్లాస్ వెళ్లిన ఆయనకు ఎన్ఆర్ఐ తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. నవంబర్ 5న ఎమ్మెల్యే యార్లగడ్డ తిరిగి రాష్ట్రానికి చేరుకుంటారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

కానూరు, న్యూస్‌టుడే: కానూరు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పటమటలంక ఎన్ఎస్ఎం వాకర్స్ అసోసియేషన్ సభ్యుల నేతృత్వంలో రూ.10వేల విలువైన నిత్యావసర వస్తువులు గురువారం అందించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, పి.రమేష్, కె.రామకోటేశ్వరరావు, డి.సుధాకర్ తదితరులు ఉన్నారు.

చక్రబంధం... ఇదిగో వ్యూహం!

ప్రతి రోజూ సాయంత్రం వేళ.. బెంజిసర్కిల్ ట్రాఫిక్ పాయింట్లలో వాహనాలు బారులు తీరతాయి. రోడ్డు దాటేందుకు కనీసం రెండు సార్లు ఆగాల్సిందే.

- మహానాడు కూడలిలో పగలు సిగ్నల్ పాయింట్ దాటాలంటే కనీసం 10 నిమిషాలు పడుతుంది. సాయంత్రం నుంచి రద్దీ మరింత పెరుగుతుంది. ఎప్పుడు కదులుతామో చెప్పలేని పరిస్థితి.
- రామవరప్పాడు రింగ్ వద్ద ఇరుకైన రోడ్డులో యూ టర్న్ తీసుకునే వాహనాలు స్తంభించిపోతాయి.
- పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి బయటకు వచ్చిన ప్రయాణికులు.. పక్కనే ఉన్న లోబ్రిడ్జి వైపు వెళ్లడానికి నడక మార్గమే లేదు. రోడ్డుపై నడుస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ట్రాఫిక్‌పై అధికారుల ప్రత్యక్ష పరిశీలన

సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు



విజయవాడ నేరవార్తలు, రామవరప్పాడు, న్యూస్‌టుడే

నగరంలో ప్రధాన కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడెక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నాయో ట్రాఫిక్ పోలీసు అధికారులు గుర్తించారు. పరిష్కారమార్గాలపై నగరపాలక సంస్థ అధికారులు, జాతీయ రహదారుల విభాగం అధికారులతో కలిసి సర్వే ప్రారంభించారు. కొన్నింటికి పరిష్కారాలు కనుగొన్నారు. వీటిని గురువారం ట్రాఫిక్ ఏడీసీపీ ఎ.వి.ఎల్.ప్రసన్న ఇతర అధికారులు కలిసి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఎదుట ప్రస్తావించారు. తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

కృష్ణలంకలో జాతీయ రహదారిపై...

కృష్ణలంక వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమవుతున్నాయి. కార్లు.. ఇతర చిన్న వాహనాలు నగరంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాశం బ్యారేజీ వైపు నుంచి మహాత్మా గాంధీ రోడ్డులోకి వెళ్లాల్సిన వాహన చోదకులకు మార్గం తెలియక బెంజిసర్కిల్ వరకు వచ్చేస్తున్నారు. అక్కడి నుంచి మహాత్మా గాంధీ రోడ్డులోకి వెళుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జాతీయ రహదారులపై విస్తృతంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అమెరికన్ ఆసుపత్రి వైపు నుంచి జాతీయ రహదారిలోకి ప్రవేశించే మార్గం ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఏం చర్యలు తీసుకుంటే మంచిదో చర్చించారు. వారధి వద్ద ఏర్పాటు చేసిన ఐలాండ్ల వెడల్పు ఎక్కువగా ఉండడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీనికి ప్రత్యామ్నాయంగా ఐలాండ్ల నిడివి తగ్గించి, రోడ్డు వెడల్పు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా స్క్యూబ్రిడ్జి నుంచి బెంజిసర్కిల్ వైపు వచ్చేటపుడు అక్కడ సర్వీసు రోడ్డులోకి కలిసే మార్గం ఇరుకుగా ఉంది. దీన్ని వెడల్పు చేస్తే.. వాహనాలు సర్వీస్‌రోడ్డులోకి వెళ్లి, మహాత్మా గాంధీరోడ్డులోకి ఆగకుండా వెళ్లిపోతాయి. ఫలితంగా బెంజిసర్కిల్‌పై కొంత మేర ట్రాఫిక్ భారం తగ్గుతుంది.

రామవరప్పాడు రింగ్‌లో భయం

రామవరప్పాడు రింగ్ వద్ద నిత్యం ట్రాఫిక్ కష్టాలే. ప్రధానంగా ఏలూరు వైపు వెళ్లే కార్లు, ట్రావెల్స్ బస్సులు, ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారిపై అంచుల్లో ఆపుతున్నారు. దీని వెనుక మరికొన్ని వాహనాలు నిలిచిపోతున్నారు. రింగ్‌రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాలు పైవంతెన మీదకు వెళ్లాలంటే.. ఈ ఆగి ఉన్న వాహనాలను దాటడం కష్టమవుతోంది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. రాత్రి 9 గంటలు దాటితే ఇక గందరగోళమే. విశాఖపట్నం వెళ్లే ట్రావెల్స్ బస్సులన్నీ జాతీయ రహదారిపైనే ఆపుతున్నారు. దీని పక్కనే విశాలమైన సర్వీసురోడ్డు ఉంది. అక్కడ నిలిపితే.. ఎవరికీ ఇబ్బంది ఉండదు.

ప్రతిపాదనలు ఇవీ..

- కృష్ణలంక, గవర్నర్‌పేట, గాంధీనగర్, పటమటలో రహదారులపై ఆక్రమణలు తొలగించడం.
- రామవరప్పాడు రింగ్ వద్ద ఫుట్‌పాత్ వెడల్పు తగ్గించి, రోడ్డు వెడల్పు చేయడం.
- పటమట బస్టాపు ఎదురుగా ఉన్న సెంట్రల్ డివైడర్ కటింగ్‌ను మూసివేసి, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేయడం.
- కనకదుర్గమ్మ వారధి వద్ద ట్రాఫిక్ ఐలాండ్స్ వెడల్పు తగ్గించడం.
- బెంజిసర్కిల్ వద్ద రామవరప్పాడు వైపు వెళ్లే ఫ్రీ లెఫ్ట్‌ను సర్వీస్ రోడ్డులోకి అనుసంధానించడం.

సీపీ పర్యవేక్షణ : కనకదుర్గమ్మ వారధి, రామవరప్పాడు, బెంజిసర్కిల్, మహానాడు కూడలి, ప్రకాశం బ్యారేజీ ప్రాంతాల్లో డ్రోన్స్ ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. డ్రోన్ విజువల్స్‌ను సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. గురువారం కనకదుర్గమ్మ వారధిపై చిన్నపాటి ప్రమాదంలో వాహనచోదకులు గొడవ పడ్డారు. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి.. ట్రాఫిక్ క్లియర్ చేశారు. కారకులైన చోదకులకు రూ.2వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు.

అమలు చేస్తే..

ట్రాఫిక్ సమస్యలపై అధికారులు చేసిన ప్రతిపాదనలు సక్రమంగా అమలు చేస్తే.. నగరంలో ట్రాఫిక్ సమస్య కొంత మేర తగ్గుతుంది. దీనికి ప్రజలు, వాహన చోదకులు సహకారం అందించాల్సి ఉంది. అందరూ కలిసి ముందుకు వెళితేనే రద్దీ సమయంలో ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ కష్టాలు తీరతాయి. ప్రజలకూ ఇబ్బందులు తీరతాయి.



పట్టభద్రుల ఓటర్ల ఫారం అందిస్తున్న తెదేపా మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోండి

కానూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెదేపా మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర అన్నారు. పురపాలికలోని అన్ని ప్రాంతాలలో గురువారం పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు పత్రాలను అందించారు.

లోపాల పుట్టగా రీసర్వే

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వే మొత్తం లోపాల పుట్టగా మారిందని, దీని వల్ల గ్రామాల్లో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. విస్తీర్ణాలు తగ్గించేయడం, ఒకరి పొలానికి మరొకరి సర్వే నంబరు ఇవ్వడం, రైతులందరికీ జాయింట్ ఎల్పీఎం నంబర్లు ఇవ్వడం ద్వారా భూముల క్రయవిక్రయాలు నిలిచి పోయాయన్నారు. గురువారం రంగన్నగూడెంలో రెవెన్యూ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామంలోనే సుమారు 100 ఎకరాలకు సంబంధించి ఇప్పటికీ రీసర్వే అనంతరం సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వి.నాగభూషణానికి వినతిపత్రం అందించారు. సర్పంచి కసుకుర్తి రంగామణి, తెదేపా గ్రామ అధ్యక్షుడు మొవ్వా వేణుగోపాల్, మండల, గ్రామ సర్వేయర్లు ఫణికుమార్, సుష్మ, వీఆర్వో సీమోను పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో భాగస్వాములవ్వాలి



మొక్కల్ని పంపిణీ చేస్తున్న లయన్స్ జిల్లా గవర్నరు శేషగిరి, పక్కన తదితరులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: సామాజిక సేవల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వడమే కాకుండా భవిష్యత్తు తరాల మనుగడ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచాలని లయన్స్ జిల్లా గవర్నరు గద్దె శేషగిరి అన్నారు. ఉయ్యూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నేరేళ్ల తేజ ఆధ్వర్యంలో గురువారం ఉయ్యూరులో జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. మధుమేహం, పర్యావరణ పరిరక్షణ, పిల్లల్లో క్యాన్సర్, విజన్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. లయన్స్ జిల్లా క్యాబినెట్ డిప్యూటీ కార్యదర్శి ఎన్.సాంబశివరావు, జోన్ ఛైర్‌పర్సన్ ఎం.డి.ఇస్మాయిల్, కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న పద్మారాణి తదితరులు

డీఎస్సీ అభ్యర్థులకు ఉపయుక్తం

ఉయ్యూరు: త్వరలో జరిగే డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను గురువారం జడ్పీ పాఠశాలలో గుడివాడ ఉప విద్యాశాఖ అధికారిణి పద్మారాణి ఆవిష్కరించారు. అభ్యర్థులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. యూటీఎఫ్ నాయకుడు రమణ, విశ్రాంతి ఎంఈవో విశ్వమోహన్, జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్నదేవి, యూటీఎఫ్ జిల్లా కౌన్సిలరు మాధవి, యూటీఎఫ్ కార్యదర్శి సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ డీజిల్ విక్రయిస్తున్నారంటూ ఆరోపణ



రెండు సీసాల్లో డీజిల్ ఒకే రకంగా లేదంటూ చూపుతున్న మెకానిక్

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : స్థానికంగా ఉన్న ఓ పెట్రోల్ బంకులో కొంత కాలం నుంచి కల్తీ డీజిల్ విక్రయిస్తున్నారని, దీని వల్ల తన కారు పాడైందంటూ తమిరి రమేష్ అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. సదరు బంకులో విక్రయించే డీజిల్‌లో కిరోసిన్ కలుపుతున్నారంటూ ఆరోపించారు. ఇటీవల తన కారు రెండుసార్లు వెంట వెంటనే మొరాయించడంతో స్థానికంగా ఉన్న మెకానిక్ షెడ్డుకు తీసుకెళ్లగా డీజిల్ కల్తీనే ఈ సమస్యకు కారణమని చెప్పారు. అందుకే గురువారం ఈ బంకుతో పాటు, వేరే దానిలో డీజిల్‌ను వేర్వేరుగా సీసాల్లో నింపి పరిశీలించగా రంగు తేడా ఉందంటూ రెండు సీసాలను చూపుతూ స్వీయ వీడియో విడుదల చేశారు. అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రమేష్ కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

? పోరంకి గద్దె గార్డెన్స్ ఆర్టీసీ కాలనీలో నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో వాన నీటితో పాటు మురుగునీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

✔ ఖాళీ స్థలాలను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు అందజేశాం. వారు స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. **- భవానీప్రసాద్, తాడిగడప పురపాలిక కమిషనర్**

? పోరంకి - నిడమానూరు రోడ్డు, ప్రభునగర్ ప్రాంతాల్లో పచ్చని చెట్లను కొందరు నరికేస్తున్నారు. వాటిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

✔ పచ్చని చెట్లను నాశనం చేసే వ్యక్తులను గుర్తించి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం.

- భవానీప్రసాద్, తాడిగడప పురపాలిక కమిషనర్

- న్యూస్‌టుడే, పోరంకి

? గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఆ సమస్యల్ని పరిష్కరించాలి.

- వెంకటేశ్వరరావు, గన్నవరం

✔ ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. మరింత ప్రచారం చేసి వీలైనంత త్వరలో రీసర్వే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. **- చిట్టిబాబు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్**

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



తెదేపా కౌన్సిలర్ పి.శ్రీనివాసరావు, వైకాపా కౌన్సిలర్ సురేష్‌బాబు మధ్య వాగ్వాదం



ఉయ్యూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల మధ్య గలాట

ఉయ్యూరు, న్యూస్‌టుడే: టిడ్కో గృహ లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి వస్తున్న ఒత్తిడిపై గురువారం జరిగిన నగర పంచాయతీ అత్యవసర కౌన్సిల్ సమావేశంలో వైకాపా, తెదేపా కౌన్సిలర్ల మధ్య తీవ్రస్థాయిలో గలాటా జరిగింది. నగర పంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్ టిడ్కో గృహాల లబ్ధిదారులు బ్యాంకుల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని ప్రశ్న లేవనెత్తారు. దీనికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని 10వ వార్డు కౌన్సిలరు పల్యాల శ్రీనివాసరావు అనడంతో వైకాపా, తెదేపా వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వైకాపా కౌన్సిలర్లు, వైస్‌ఛైర్మన్లు పి.సురేష్‌బాబు, అర్షతున్నీసాలు కౌన్సిలరు శ్రీనివాసరావు అన్న మాటపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాదులాడుకున్నారు. కౌన్సిలర్లు సుధారాణి, రమణలు కూడా వైకాపా కౌన్సిలర్లతో వాదించారు. గొడవ పెరిగి పెద్దదై సురేష్‌బాబు, శ్రీనివాసరావులు ఒకరిపై ఒకరు దూసుకెళ్లే ప్రయత్నం చేయగా కార్యాలయ వర్గాలు వారిద్దరిని వారించి అదుపు చేశారు. తర్వాత ఛైర్మన్ నాని ఆయా వర్గాలకు నచ్చజెప్పి ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు అడగడం సహజం, అధికార పక్షం సమాధానమివ్వడం సరైందని పేర్కొన్నారు. అలాగే టిడ్కో గృహాల సమస్య ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సి ఉందని, ఆ కోణంలో ఉన్నతాధికారులు బ్యాంకు ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నారని చెప్పారు. లబ్ధిదారులు భయపడవద్దని చెప్పారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రూ.2.57 కోట్లతో వివిధ అభివృద్ధి పనుల ప్రతిపాదనల్ని కౌన్సిల్ ఆమోదించింది. సమావేశాన్ని కమిషనరు పి.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. పట్టణ ప్రణాళిక అధికారిణి ఆషా, ఏఈలు జాస్మిన్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఆక్రమణల తొలగింపు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ఆక్రమణల తొలగింపుతో నగర పంచాయతీ, పోలీసు శాఖలు నడుం బిగించాయి. గురువారం సాయంత్రం విజయవాడ- మచిలీపట్నం ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణల్ని కమిషనరు పి.వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్సై విశ్వనాథ్‌లు తమ సిబ్బందితో తొలగించారు. ఆక్రమణలకు అడ్డూఅదుపు లేనందున ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంగా ఉంది. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో నగర పంచాయతీ, పోలీసు శాఖలు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. ఈ ఆక్రమణల తొలగింపు పర్వం పూర్తిస్థాయిలో కొనసాగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

వైద్యురాలి ఇంట్లో రూ.1.3లక్షల చోరీ

పెనమలూరు, న్యూస్‌టుడే: ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఓ వైద్యురాలి ఇంట్లో జరిగిన చోరీలో రూ.1.3 లక్షలు మాయమయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గోరౌట్ల రజని పోరంకిలోని ఆదర్శ్ గార్డెన్ హోమ్స్‌లో నివాసముంటున్నారు. ఆమె ఇంట్లో పనిచేయడానికి ఇద్దరు మహిళలను నియమించుకున్నారు. కొద్దిరోజులుగా ఆమె ఇంట్లో తరచూ నగదు పోతుండడంతో అనుమానం వచ్చి వారం కిందట ఆమె బీరువాలో దాచిన రూ.3.5లక్షల నగదు గురువారం పరిశీలించారు. అందులో రూ.1.3లక్షలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గ్రహించి పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

కానూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ కృష్ణా జిల్లా ఇన్‌ఛార్జి మార్నీడి బాబ్జీ అన్నారు. కానూరులో గురువారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలను సీఎం చేసేలా అందరూ కష్టపడి పని చేయాలన్నారు. పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా ధనేకుల మురళీమోహనరావును నియమిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లుకృష్ణ, మోహనరావు, సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, టి.రాధామాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ ఆక్యుపంక్చర్ డే వేడుకలు

కానూరు, న్యూస్‌టుడే: ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరూ మందులు అవసరం లేని ఆరోగ్య విధానం అలవర్చుకోవాలని ఏస్పా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. కానూరులోని ఇండియన్ ఓం కార్యాలయంలో గురువారం నేషనల్ ఆక్యుపంక్చర్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్యుపంక్చర్ సైన్స్ ఒక జీవన విధానమని, ప్రతి ఒక్కరూ ఈ విధానాన్ని స్వయంగా అభ్యసించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆక్యుపంక్చర్స్ ప్రాక్టీస్ నర్సు కన్వీనర్‌గా కాశీ మహంతిసునీతను, తెలంగాణ కన్వీనర్‌గా ఏవీఎస్ కుమారస్వామి, ఒడిశాకు శ్యామల, వెస్ట్ బెంగాల్‌కు తవుసిఫ్, ఏస్పా సంఘం భారత్ అధ్యక్షుడుగా ఎ.రవి, ఉపాధ్యక్షుడిగా జ్యోతిరాజు తదితరులను ఎన్నుకున్నారు.

బాబోయ్ శునకాలు.. జనం బెంబేలు



కంకిపాడు : బందరు రోడ్డుపై వీధి కుక్కలు

కంకిపాడు, న్యూస్‌టుడే: కంకిపాడులోని పలు ప్రాంతాల్లో వీధి శునకాలు గ్రామస్థులు, ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. నాలుగు నుంచి పది వరకు బృందంగా సంచరిస్తున్నాయి. ప్రధానంగా కల్యాణ మండపాలు, మాంసం దుకాణాలు, చెత్తకుండీల సమీపంలో వీటి బెడద అధికంగా ఉంది. ద్విచక్ర వాహనదారుల వెంటపడడంతో చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమయంలో వాహనం అదుపు తప్పడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులపై దాడి చేస్తున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోందని రికార్డులు రాసే సిబ్బంది చెబుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తెదేపా నాయకుడు వై.కిషోర్‌బాబు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు పంపారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వైద్య నిపుణురాలు అనీలా పాటిబండ్ల

అంబాపురం(రామవరప్పాడు), న్యూస్‌టుడే : మహిళలు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని అమెరికన్ అంకాలజీ వైద్య నిపుణురాలు అనీలా పాటిబండ్ల అన్నారు. గురువారం విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో కేబీఎన్ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్, అమెరికన్ అంకాలజీ సంయుక్త ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మారుతున్న జీవన శైలితో పాటుగా కొన్ని జన్యుపరమైన అంశాల కారణంగా క్యాన్సర్ వస్తుందని చెప్పారు. దీన్ని ముందుగా కనిపెడితే, తగిన వైద్యంతో నివారించేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. ఉమెన్ స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.



గొడవర్రు: కరపత్రాలతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు

గొడవర్రు (కంకిపాడు), న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లయన్స్ క్లబ్ జిల్లా సమన్వయకర్త బొబ్బా హరినాథ్‌బాబు అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గొడవర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో క్యాన్సర్‌కు కారణాలు, నివారణ, లక్షణాలు, ముందస్తు గుర్తింపు, చికిత్సపై సదస్సు నిర్వహించారు. దీనికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సంఘం ప్రతినిధులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.గోవిందరావు, పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించండి

కంకిపాడు, న్యూస్‌టుడే: మండలంలో శుక్రవారం నుంచి నిర్వహించే పశుగణనకు సహకరించాలని పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.మాధవరావు యజమానులకు ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గృహాలకు వచ్చే సిబ్బంది పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు, పందులు, గుర్రాలు తదితర 16 రకాల పెంపుడు జంతువులు, పక్షుల వివరాలను నమోదు చేసుకుంటారని పేర్కొన్నారు. ఈ గణనతో పథకాల అమలు, బడ్జెట్ కేటాయింపు, వ్యాధి నిరోధక చర్యలు తీసుకోవడానికి సమగ్ర సమాచారం తోడ్పడుతుందన్నారు.

గుడివాడ

• గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

చల్లపల్లిలో ఇసుక రీచ్‌లు లేవు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండల పరిధిలో ఎలాంటి ఇసుక రీచ్‌లు లేవని, ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డి.వనజాక్షి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే ఉచిత ఇసుక తీసుకెళ్లవచ్చని చెప్పారు. చల్లపల్లి మండలం సీఆర్‌జడ్ పరిధిలో ఉండటం వలన ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని చెప్పారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ఇసుక రీచ్‌ను గుర్తించామని, అక్కడ ఏర్పాటు చేసే స్టాక్ పాయింట్ నుంచి మాత్రమే ఇసుకను తెచ్చుకోవాల్సి ఉందని తెలిపారు. చల్లపల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

గ్రామ సభల్లో మూడు అర్జీలు

బల్లిపర్రు(పామర్రు గ్రామీణం): బల్లిపర్రులో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో తహసీల్దార్ జి.రవికాంత్, మండల సర్వేయర్ రామకృష్ణ పాల్గొనగా ఇటీవల జరిగిన రీ సర్వేలో తప్పులు దొర్లాయని.. తమ పొలాలను మళ్లీ సర్వే చేయాలని ముగ్గురు రైతులు అర్జీలు సమర్పించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు కొత్త లైన్ల నిర్మాణ పనుల్లో భాగంగా మండలంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ ఈఈ జి.బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు.

పమిడిముక్కల: విద్యుత్తు లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మామిళ్లపల్లి, అగినపర్రులలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బి.శ్రీనివాసరావు తెలిపారు.

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలకు విశేష స్పందన



విజేతలకు బహుమతులు అందిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్ విజయ్ భాస్కర్, ఉపాధ్యాయులు



వ్యాస రచన పోటీల్లో చిన్నారులు

'ఈనాడు' ఆధ్వర్యంలో గుడివాడ రాజేంద్రనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా సాటవ పోటీలకు విశేష స్పందన లభించింది. "అంతర్జాలం వినియోగం, లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం" అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో విజేతలైన 9వ తరగతి విద్యార్థులు యు.చరణ్, కె.సాయి సాత్విక్, ఏజేఎన్ఎస్.అర్జున్‌కు ప్రధానోపాధ్యాయుడు ఎస్.విజయభాస్కర్, డీన్ త్రినాధ్, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి కె.కోటేశ్వరరావు బహుమతులు అందజేశారు.

- న్యూస్‌టుడే, గుడివాడ పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? రాజేంద్రనగర్ ఎస్బీఐ ఎదురుగా ఖాళీ స్థలంలో మొక్కలు పెరిగి ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. చుట్టుపక్కల వారు ఇక్కడ చెత్త వేయడం వల్ల ఇబ్బందిగా ఉంది.

–ఎ.రంగ ప్రసాద్, గుడివాడ

? బ్రహ్మంగారి గుడి ఏరియా ఏడో వార్డులో పైపు లైను వేసి చాలా కాలం కావడంతో కలుషిత నీరు వస్తోంది.

– ఉమ, విశ్రాంత ఉపాధ్యాయిని,

✔ ఏడో వార్డులో పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపించి కలుషిత నీటి సమస్య పరిష్కరిస్తాం

– పి.శ్రీనివాసరావు, పురపాలక సంఘం సహాయ కమిషనర్

? నంగేగడ్డలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు పారక ఇబ్బందులు పడుతున్నం –గ్రామస్థులు



నంగేగడ్డలో ఇళ్ల పక్కన వర్షపు నీరు

✔ డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరిస్తాం.

– మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి, నంగేగడ్డ

–న్యూస్‌టుడే, గుడివాడ పట్టణం, నాగాయలంక

రహదారికి మరమ్మతులు

దక్షిణచిరువోలులంక(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఇటీవల కృష్ణా నదికి వచ్చిన భారీ వరదలకు దక్షిణ చిరువోలులంకలోని ప్రధాన రహదారి పలు ప్రాంతాల్లో కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. గ్రామ తెదేపా అధ్యక్షుడు బచ్చు రాఘవయ్య గురువారం గుంతలను పూడ్చడానికి ఇటుక రాయి ముక్కలు కొనుగోలు చేసి మరమ్మతులు చేయించారు.

నరకానికి నకళ్లు..

గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో ఛిద్రమైన రహదారులు



అయ్యంకి అడ్డరోడ్డు నుంచి కూచిపూడి మార్గంలో..

న్యూస్‌టుడే, చల్లపల్లి, కూచిపూడి

వైకాపా సర్కారు అయిదేళ్ల పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోక రహదారులన్నీ నరకానికి నకళ్లుగా మారాయి. అప్పట్లో ఏర్పడిన గుంతలు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అగాధాలుగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక నాయకులు గోతులు పూడ్చినా వాన నీరు నిల్వ ఉండటంతో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. యాక్సిల్స్, సైలెన్సర్లు విరిగిపోతూ వాహనాలు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణాలు మరింత ప్రమాదకరంగా మారాయి.

☛ చల్లపల్లి 6వ నంబరు కాల్వ దగ్గర నుంచి విజయవాడ-చల్లపల్లి రహదారి పొడవునా, ఎన్టీఆర్ పార్కు వద్ద భారీగా గోతులు పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

☛ చల్లపల్లి ప్రధాన కూడలిలో, చల్లపల్లి-పెదకళ్లేపల్లి రోడ్డు అంతా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారిలో జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు.

☛ చల్లపల్లి-నడకుదురు మార్గంలో ఏర్పడిన గుంతల్లో రహదారి వెతుక్కోవాల్సిన పరిస్థితి. నిత్యం వందలాది ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు వాహనాలు, బైకుల రాకపోకలు సాగిస్తూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

☛ చల్లపల్లి-పాగోలు-కె.కొత్తపాలెం రహదారి మొత్తం ప్రమాదకరంగా ఉంది. నడకుదురు పంచాయతీ రాముడుపాలెం రహదారిలో నడక నరకప్రాయమే.



చల్లపల్లి ప్రధాన కూడలిలో ఇలా..



ఎన్టీఆర్ పార్కు వద్ద..



కూచిపూడి నుంచి బార్లపూడి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి..

☛ లక్ష్మీపురం నుంచి చింతలమడ రహదారి, నూకలవారిపాలెం, మంగళాపురం, మచిలీపట్నం-మాజేరు రహదారుల్లో రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

☛ మొవ్వ మండలం అయ్యంకి నుంచి అయ్యంకి అడ్డరోడ్డు, పెదపూడి, కూచిపూడి మీదుగా ఆర్అండ్‌బీ మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది.

☛ కూచిపూడి నుంచి బార్లపూడి ఆర్అండ్‌బీ మార్గం, బార్లపూడి నుంచి భట్లపెనుమర్రు వెళ్లే పంచాయతీ రాజ్ రహదారి పూర్తిగా శిథిలమయ్యాయి.

☛ వర్షాలు తగ్గిన వెంటనే గుంతలు పూడ్చి ప్రయాణ కష్టాలు తీర్చాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

నాగులచవితి సమన్వయ కమిటీ సమావేశం నేడు

మోపిదేవి, న్యూస్‌టుడే: నవంబరు 5న నాగుల చవితి పురస్కరించుకొని వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరిగే ఉత్సవ ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాద్ పేర్కొన్నారు. సమావేశానికి సంబంధిత అధికారులు అందరూ హాజరు కావాలని సూచించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

ఘంటసాల, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని ఘంటసాల పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సై ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను ఉపయోగించాలని తెలిపారు. ఆపదలో ఉన్నప్పుడు ఆ యాప్ ఎంతో ఉపయోగ పడుతోందన్నారు. పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో నేరాలు కూడా పెరుగుతాయని.. బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంకు ఛీఫ్ మేనేజర్(విజిలెన్స్) కె.వెంకటరాజు పేర్కొన్నారు. విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలోని యూనియన్ బ్యాంకులో గురువారం ఖాతాదారులకు అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ పి.జ్యోతి, సహాయ మేనేజర్ ఎ.మనోజ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

నాగాయలంక, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాజేష్ తెలిపారు. సొర్లగొంది గ్రామానికి చెందిన కొప్పనాతి సురేష్ అధిక ధరకు మద్యాన్ని అమ్ముకునేందుకు నాగాయలంక నుంచి తీసుకెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సైకి సిబ్బందితో కలిసి గురువారం రేమాలవారిపాలెం వంతెన సమీపంలో అతని వద్ద 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాండవకృష్ణ మృతికి ఎమ్మెల్యే సంతాపం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వరదా తాండవకృష్ణ(70) మృతికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం సంతాపం తెలిపారు. ఆర్యవైశ్యులను రాజకీయంగా చైతన్య వంతులను చేసేందుకు ఆయన కృషిచేశారని చెప్పారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

శ్మశానవాటికలకు స్థలం కేటాయించాలి

పామర్రు, న్యూస్‌టుడే: క్రైస్తవుల శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని పీటీపీఎఫ్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సాల్మన్ కోరారు. గురువారం గుడివాడ రోడ్డులోని పీటీపీఎఫ్ కార్యాలయంలో క్రైస్తవుల సమస్యలపై నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. పాస్టర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. క్రైస్తవ వధూవరులకు పెళ్లికానుక ఇవ్వాలని, దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. పాస్టర్లు టి.షాలేమురాజు, ఎం.శ్యామ్యూల్, కె.ఇమ్మానుయేలు, జాన్‌మోజెస్, ఎ.ఆదాము తదితరులు పాల్గొన్నారు.

పులిగడ్డలో 104 వైద్యసేవలు

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం): పులిగడ్డలోని ఆరోగ్య ఉప కేంద్రంలో గురువారం 104 వైద్యసేవల శిబిరం నిర్వహించారు. డాక్టర్ రియాజ్ 72 మందికి వైద్య సేవలందించారు. పులిగడ్డలోని ప్రధాన పాఠశాల, పల్లెపాలెంలోని పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.

బందరు రోడ్డుపై లారీల తొలగింపు



లారీలు తొలగింపజేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ - మచిలీపట్నం రహదారిపై లారీలు నిలిపివేస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని 'ఈనాడు'లో గురువారం 'మా ఇష్టం.. ఇక్కడే నిలుపుతాం' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఎస్పీ గంగాధరరావు స్పందించారు. తక్షణం ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పోలీసులకు ఆదేశాలు జారి చేశారు. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్, ఏఎస్ఐలు భాగ్యవతి, శంకర్, సిబ్బంది కలిసి లారీలను తొలగింపజేశారు. పార్కింగ్ స్థలంలోనే లారీలు నిలపాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జరిమానా విధిస్తామన్నారు.

స్పందనకు వందనం

ఆ వసతి గృహంలో అన్నీ సమస్యలే



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి

గుడ్లవల్లేరు (గుడివాడ గ్రామీణం), న్యూస్‌టుడే: గుడ్లవల్లేరులోని బీసీ బాలుర కళాశాల వసతి గృహాన్ని గుడివాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి గురువారం తనిఖీ చేశారు. మరుగుదొడ్లు బాగులేవని, తలుపులు లేవని, అపరిశుభ్రంగా ఉన్నాయని, తాగునీటి సమస్య ఉందని న్యాయమూర్తి గుర్తించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు.

రేపటి నుంచి తెదేపా సభ్యత్వ నమోదు

పామర్రు, న్యూస్‌టుడే: ఈ నెల 26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. గురువారం తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల వారీగా కార్యకర్తలందరూ సమేకమై సహకరించాలన్నారు. ఎక్కువ సభ్యత్వం చేయించిన వారికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వల్లూరుపల్లి గణేష్, సందీప్, చాట్ల రమేష్, వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.81 లక్షలు

మంటాడ(పమిడిముక్కల), న్యూస్‌టుడే: వైకుంఠవెంకటేశ్వరస్వామి, కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లోని 9 హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన కానుకల్ని గురువారం లెక్కించగా రూ4,81,137 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి మాధవీలత తెలిపారు. ఆలయాల తనిఖీ అధికారి అనూరాధ, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు అగస్త్యరాజు రామోహనరావు, సేవాసమితి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సాయం అందించడమే క్లబ్ ధ్యేయం

యాకమూరు (తోట్లవల్లూరు), న్యూస్‌టుడే : పేదలకు, ఆపద సమయంలో అవసరమైన వారికి చేయుత నివ్వడంలో ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ లయన్స్‌క్లబ్ ముందుంటుందని లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. యాకమూరులో గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ వరద బాధిత కుటుంబాలకు అయిదు రకాల వస్తువులతో కూడిన(దుప్పటి, తుండు, ప్లాస్టిక్ బాకెట్, మగ్గు, చాప) కిట్లను 30 మందికి అందజేశారు. ను క్లబ్ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు, క్లబ్ సభ్యులు సుభాష్, రామకృష్ణ, చెన్నారెడ్డి, నేరెళ్ల తేజ, జ్యోతి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఏఎన్నార్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్ తెలిపారు. కళాశాల పాలకవర్గ సమావేశ మందిరంలో విజేతలు ఎన్.సతీష్ కుమార్, డి.సాయి చరణ్, ఎం.వేణుగోపాలుడు, పి.శ్యామ్‌ప్రసాద్, బి.మనోజ్, వి.శ్రీకాంత్, సాయిలను గురువారం అభినందించారు. వారిలో నితీష్‌కుమార్, సాయి చరణ్ చెన్నై ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికయ్యారన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్ ఆర్‌కే.ప్రసాద్, సెక్రెటరీ, కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు, వైస్ ప్రిన్సిపల్ బి.ఎస్.ఎస్.పద్మజ, పీడీ వీర్ల గోపి అభినందించారు.

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక అస్సెస్సీ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో గురువారం నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అస్సెస్సీ పాఠశాల విద్యార్థులు విజయం సాధించారని ప్రిన్సిపల్ సదాస్టియన్ తెలిపారు. అండర్-14 బాలికల 600 మీటర్ల పరుగు పందెంలో హర్షిత ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో విక్షిక ద్వితీయం, హైజంప్‌లో ఎ.నాగక్షీరజ, షాట్‌పుట్‌లో కె.లక్ష్మి ద్వితీయం సాధించిందని తెలిపారు. విజేతలను ప్రిన్సిపల్ అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న అప్పారావు తదితరులు



విద్యార్థులతో అస్సెస్సీ పాఠశాల ప్రిన్సిపల్ సదాస్టియన్

ఆదాయం ఘనం.. సౌకర్యాలు పూజ్యం

దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా యలమర్రులోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ ముఖమండప పునర్నిర్మాణం, నవగ్రహ మండపం నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుడి అభివృద్ధికి ప్రభుత్వ నిధులు రూ.22 లక్షలు, గ్రామానికి చెందిన దాత శ్రీపతి శ్రీనివాసనావు రూ.7.40 లక్షలు ఇచ్చారు. ఇప్పటికే రెండు సార్లు శంకుస్థాపనలు చేశారు. ముఖమండపం పడగొట్టి నాలుగేళ్లు అయ్యిందని.. ఇప్పటికీ నిర్మాణం చేపట్టకపోవడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మహిళా భక్తులు కోరుతున్నారు. గుడికి 25 ఎకరాల భూముల నుంచి ఆదాయం వస్తున్నా సౌకర్యాలు అంతంతమాత్రమేనని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని భక్తులు, గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై దేవస్థానం ఈవో ప్రసాద్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం వల్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.



రామలింగేశ్వరస్వామి ఆలయం

- న్యూస్‌టుడే, పెదపారుపూడి

మద్యం దుకాణాలకు అనుమతులివ్వొద్దు



చేనేత కార్మికుల కాలనీలో నిరసన తెలుపుతున్న మహిళలు, పలు కాలనీ వాసులు

ఘంటసాల, న్యూస్‌టుడే: జనావాసాలు, ఇళ్ల మధ్యలో మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతులివ్వొద్దని ఘంటసాలలోని పలు కాలనీల వాసులు పేర్కొన్నారు. గురువారం వారు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దారు కనకదుర్గకు అందజేశారు. స్థానిక కాలనీలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. గ్రామం శివారులో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

జాతీయ స్ఫూర్తి పురస్కారానికి ఎంపిక



దేవరపల్లి సురేష్‌బాబు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లికి చెందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు సర్దార్ వల్లభాయ్‌పటేల్ జాతీయ స్ఫూర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో హోప్ స్వచ్ఛంద సంస్థ, సింధు ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జరిగే మాజీ సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి ఉత్సవాల్లో సురేష్‌బాబు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్, ప్రముఖులతో పాటు సురేష్‌బాబు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

ఆలపాటి భారీ విజయం ఖాయం



వెంకట్రామ్‌కు దరఖాస్తు ఇస్తున్న ఎంపీపీ దుర్గావాణి

మోపిదేవి, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఓట్లు వందశాతం నమోదుకు కృషి చేయాలని యువ నాయకుడు మండలి వెంకట్రామ్ పేర్కొన్నారు. గురువారం మోపిదేవిలో ఓటు నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఓటు నమోదు నియోజకవర్గ పరిశీలకులు రావి రత్నగిరి పర్యవేక్షణలో ఎంపీపీ రావి దుర్గావాణి దరఖాస్తును మండలి వెంకట్రామ్‌కు అందించారు. వెంకట్రామ్ మాట్లాడుతూ.. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తెదేపా మండల అధ్యక్షుడు నడకుదిటి జనార్దనరావు, రావి నాగేశ్వరరావు, ఉప ఎంపీపీ సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు విశేష స్పందన

చల్లపల్లి, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రానికి 3వ రోజు విశేష స్పందన లభించిందని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ తెలిపారు. చల్లపల్లిలోని ఏటీఎం సెంటర్‌లో ఓటు నమోదు కేంద్రంలో పట్టభద్రులకు ఓటు నమోదు చేస్తున్నారు. ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, షేక్ నబీ ఘోరి, తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: సీనియర్ న్యాయవాది తిమ్మన సుబ్బారావు ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులకు, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా కూటమి ఆధ్వర్యంలో గురువారం ఓటరు నమోదుకు దరఖాస్తులు పంపిణీ చేశారు.

ఘంటసాల, న్యూస్‌టుడే: పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని తెదేపా నాయకులు తెలిపారు. ఘంటసాలలో పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓట్లపై అవగాహన కల్పించారు. తెదేపా నాయకులు బండి పరాత్పరరావు, అయినపూడి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తేవాలి



మాట్లాడుతున్న గొల్లు కృష్ణ

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ పేర్కొన్నారు. స్థానిక వడ్డాది ఛారిటబుల్ ట్రస్టులో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వడ్డాది రాజేష్, జిల్లా ఇన్‌ఛార్జి మర్నీడి బాబ్జి, ప్రధాన కార్యదర్శి మొవ్వా మోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు సదర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

27న గంగానమ్మతల్లి పునఃప్రతిష్ఠోత్సవం

వల్లూరుపాలెం(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే : వల్లూరుపాలెం గ్రామంలోని అంబేడ్కర్‌నగర్‌లో ఈ నెల 27న ఉదయం 11.11 గంటలకు గంగానమ్మ తల్లి పోతురాజు స్వాముల విగ్రహాల పునఃప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ అందజేత

గోగినేనిపాలెం,(ఘంటసాల), న్యూస్‌టుడే: గోగినేనిపాలెం జడ్పీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయిని జి.జయ ఆర్థిక సహకారంతో సోషల్ స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు.

పంచాయతీలకు గుర్తింపు

వెంకటాపురం(మోపిదేవి), న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో పంచాయతీలకు గుర్తింపు వస్తోందని జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ అన్నారు. గురువారం వెంకటాపురం పంచాయతీలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షలతో నిర్మించనున్న ఏడు సిమెంటు రహదారులకు భూమిపూజ చేశారు. మండలంలో రూ.5.63 కోట్ల వ్యయంతో 86 సిమెంటు రహదారుల నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. ఎంపీపీ రావి దుర్గావాణి, రావి నాగేశ్వరరావు, సర్పంచి తుమ్మా సోములమ్మ తదితరులు పాల్గొన్నారు.

★ గ్రామంలోని ఉప పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో నీరు కారుతోందని, విధుల నిర్వాహణకు ఆటంకం కలుగుతోందని వైద్యుడు లక్ష్మీనారాయణ వెంకట్రామ్ దృష్టికి తీసుకెళ్లారు.

కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

కోడూరు(అవనిగడ్డ) : కోడూరు పంచాయతీ కార్యదర్శిగా బొలిశెట్టి శేషగిరిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న యలవర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావును బదిలీ చేయడంతో నాగాయలంకలో పనిచేస్తున్న జరుగు పవన్‌ను డిప్యూటేషన్‌పై ఇన్‌ఛార్జిగా నియమించారు. ప్రస్తుతం అవనిగడ్డ మండలం పులిగడ్డ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శేషగిరిరావును బదిలీపై నియమించారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పంట ఉత్పత్తులు, యాజమాన్య పద్ధతులు, సాగు విధానంపై అవనిగడ్డలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు సైన్సు ఉపాధ్యాయిని కె.కృష్ణవేణి అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో అశ్వారావుపాలెం ఆయకట్టులో వరి పంట సాగు విధానాన్ని విద్యార్థులు పరిశీలించారు

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యతిచ్చి సిబ్బంది పని చేయాలని పురపాలక సంఘం కమిషనర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. 22, 31, 32, 33, 34 వార్డుల్లో పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని సహాయ కమిషనర్‌తో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించబోమన్నారు.